

మోటార్లను ఆన్‌చేసి పంపు హౌస్‌ను పరిశీలిస్తున్న మంత్రులు



పంపు హౌస్ నుంచి బయటకు వస్తున్న నీళ్లు

'సీతారామ' ప్రారంభం

చరిత్రాత్మక ఘట్టం

- 2026 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి ప్రాజెక్టు
- గత ప్రభుత్వం రూ.8వేల కోట్లు ఖర్చు చేసినా నీరివ్వలేకపోయింది
- తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరివ్వాలన్నదే తమ లక్ష్యం
- ఆగస్టు 15న వైరాలో సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ప్రాజెక్టు ప్రారంభోత్సవం
- అదే సభలో రూ.రెండు లక్షల రైతు రుణమాఫీ ప్రక్రియ పూర్తి
- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- పూసుగూడెం పంపుహౌస్-2 ట్రయల్‌రన్ విజయవంతం

అశ్వారావుపేట/ములకలపల్లి/కొత్తగూడెం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ప్రాజెక్టు ప్రారంభోత్సవం ఒక చారిత్రక ఘట్టమని రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఆగస్టు 2026 నాటికి సీతారామ ప్రాజెక్టును పూర్తి చేస్తామన్నారు. ఇందుకు ఎంత ఖర్చయినా ప్రభుత్వం భరించేందుకు కృతనిశ్చయంతో ఉందన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద నిర్మించిన పంపుహౌస్-2 ట్రయల్‌రన్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి ఉత్తమ్ మోటార్లను ప్రారంభించారు. కమలాపురం వద్ద పంపుహౌస్-3ని పరిశీలించారు. పంపుహౌస్-2 ట్రయల్‌రన్ ద్వారా ఎత్తిపోసిన గోదావరి జలాలకు మంత్రులు పూజలు చేశారు. ట్రయల్‌రన్ విజయవంతం కావడంతో మంత్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పూసుగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నీటి పారుదల శాఖామంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు సాగునీరందించే లక్ష్యంతో పనిచేస్తోందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రూ.81వేల కోట్లు ఖర్చుచేసి నామమాత్రపు ఆయుకట్టుకు మాత్రమే సాగునీరందించిందన్నారు. అందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏటా 6.50 లక్షల ఎకరాల చొప్పున ఐదేళ్లలో 35లక్షల ఎకరాల ఆయుకట్టుకు నీరందించాలనే ధృడసంకల్పంతో పనిచేస్తోందన్నారు. అందులో భాగంగానే సహచర మంత్రులతో కలిసి సీతారామ ప్రాజెక్ట్ పంపుహౌస్-2, 3ల ట్రయల్‌రన్ నిర్వహించామన్నారు. 15వ తేదీన వైరాలో జరిగే బహిరంగ సభ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఈ పంపు హౌస్‌లను ప్రారంభిస్తామన్నారు. అదే సభలో రైతులకు ఎంతో మేలు చేసే రూ.రెండు లక్షల రుణమాఫీ పూర్తి చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రాజెక్టు పనులు ప్రారంభినా ఇప్పటివరకు ప్రాజెక్టుకు నీటి కేటాయింపులే లేవన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాతనే 17 టీఎంసీల గోదావరి నీటిని సీతారామ ప్రాజెక్టుకు కేటాయించేలా అనుమతులకు కృషి చేస్తున్నామన్నారు. మరో 15రోజుల్లో ఈ అనుమతులు వస్తాయనే ఆశాభావాన్ని మంత్రి వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్టును తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుగా గుర్తించిందన్నారు. ఈ ప్రాజెక్టు పాత డిజైన్‌లో ఖమ్మం జిల్లాలోని కొన్ని ప్రాంతాలు లేవని, వాటికి ప్రాజెక్టులో భాగం చేయాలని సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారని తెలిపారు. త్వరలోనే దీనిపై తీసుకుంటామన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి వంటి ప్రముఖులతో ఉమ్మడి ఖమ్మం జిల్లా పటిష్టమైన నాయకత్వాన్ని కలిగి ఉందన్నారు. వారందరి సహకారంతో సీతారామ ప్రాజెక్టు పూర్తి చేసి కొత్త ఆయుకట్టుతో పాటు నాగార్జునసాగర్ పరిధిలోని 1.50లక్షల ఎకరాల స్థిరీకరణకు గోదావరి నీటిని అందించనున్నట్టు మంత్రి ఉత్తమ్ ప్రకటించారు.

సీతారామ ద్వారా ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం: మంత్రి తుమ్మల

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఎట్టిపరిస్థితుల్లోనూ గోదావరి జలాలను తీసుకురావాలనే ఉద్దేశ్యంతో 2017లో సీతారామ ప్రాజెక్టును ప్రారంభించినట్టు వ్యవసాయశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మొదటి ఐదు సంవత్సరాలు పనులు బాగానే సాగినా తరువాత పనులు నత్తనడకన సాగాయన్నారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో భాగంగా కొత్తూరు, ఆర్కే రంగాపురం, పూసుగూడెం మూడు పంపు హౌస్‌ల ద్వారా 104 కిలోమీటర్ల వరకు గోదారి జలాలను తీసుకెళ్లగలిగామని తుమ్మల తెలిపారు. ఈ ప్రాజెక్టులో భాగంగా 9.8కిలోమీటర్ల దగ్గర మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వార తుమ్మల చెరువుకి నీరందించే పనులు జరుగుతున్నాయన్నారు. అది పూర్తయితే అశ్వాపురం మండలంలో సుమారు 15,795 ఎకరాలు సాగులోకి వస్తుందని తెలిపారు. 74వ కిలోమీగర్‌వద్ద 38వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. వచ్చే సీజన్‌కల్లా దీన్ని కూడా పూర్తి చేస్తామన్నారు. 74వ కిలోమీటర్ వద్ద 38వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందన్నారు. దీనికి కూడా భూ సేకరణ పూర్తిచేయాలన్నారు. 74కిలోమీటర్ల నుండి 98వ కిలోమీటర్ వరకు రెండో ప్యాకేజీలో 34వేల ఎకరాలు సాగులోకి వస్తుందన్నారు. దీనికి రూ.380 కోట్లు ఖర్చు చేయాల్సి ఉందన్నారు. 102 కిలోమీటర్ల వద్ద రాజీవ్ లింక్ కెనాల్‌తో సాగర్ ఆయకట్టుకు గోదావరి జలాలను అందించే అవకాశం ఉంటుందని వివరించారు. ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా తక్కువ ఖర్చుతో మధ్యతహా ప్రాజెక్టులైన లంకాసాగర్, వైరా పరిధిలోని లక్ష ఇరవైవేల ఎకరాల ఎన్నెస్పీ ఆయకట్టుకు నీటిని అందించవచ్చునని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి వివరించారు.

గత ప్రభుత్వంలో రీడిజైన్‌ల పేరుతో నిధుల వృథా: మంత్రి పొంగులేటి

రెవెన్యూశాఖ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి సహకరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలోనే ఇందిరా, రాజీవ్‌సాగర్ పేర్లతో ఈ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించిందని, అప్పట్లో ఈ ప్రాజెక్టుకు రూ.2,400 కోట్లు మాత్రమే ఖర్చు అయ్యేదని, కానీ ప్రాజెక్టు డిజైన్‌మార్చి సీతారామ ప్రాజెక్టుగా నామకణచేసి గత ప్రభుత్వం రూ.18వేల కోటు ఖర్చుచేసిందన్నారు. అయినా ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ రాజ్యం వచ్చిన తర్వాతనే ఈ ప్రాజెక్టుకు మొదటి ప్రాధాన్యత కల్పించామన్నారు. అగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఈ ప్రజెక్టును ప్రాజెక్టును ప్రారంభించనున్నట్లు ప్రకటించారు ప్రస్తుతం ఈ ప్రాజెక్ట ద్వారా అశ్వారావుపేట, సత్తుపల్లి, వైరా, పాలేరు, ఖమ్మం, మధిర నియోజకవర్గాల ఆయకట్టుకు సాగునీరు అందే అవకాశం ఉందన్నారు. త్వరలో ఇల్లెందు, భద్రాచలం నియోజకవర్గాలతో పాటుగా మిగిలిన నియోజకవర్గాల్లో అవకాశాన్ని బట్టి సీతారామ ద్వారా సాగునీరందించేందకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో నీటిపారుదలశాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్‌బొజ్జా, నీటిపారుదల శాఖ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్‌పాటిల్, భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, ఇంజనీరింగ్ అండ్ చీఫ్ అనీల్‌కుమార్, చీఫ్ ఇంజనీర్ విజయభాస్కర్, ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

'సీతారామ'కు 67 టీఎంసీల

గోదావరి జలాల కేటాయింపు

- ఈ ప్రాజెక్టు ద్వారా సాగులోకి 42వేల ఎకరాల కొత్త ఆయకట్టు
- త్వరలోనే రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- వైరాలో రైతు బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన

5



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్



బొగత జలపాతం

పర్యాటకం పట్టాలెక్కేనా?

- ఉమ్మడి జిల్లాలో ఎన్నో చారిత్రాత్మక, ప్రకృతి ప్రదేశాలు
- మాటలతోనే కాలం వెళ్లదీస్తున్న పాలకులు
- నిధులు, విధుల్లో కానరాని సర్కారు ఊతం
- నేడు ఉమ్మడి జిల్లాలో మంత్రుల బృందం పర్యటన
- పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై అధ్యయనం

ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దున విస్తరించి ఉన్న ఉమ్మడి ఖమ్మంజిల్లాలో పర్యాటక ప్రదేశాలు ఎన్నో ఉన్నా నేటికీ అవి అభివృద్ధికి నోచుకోలేదు. చరిత్రాత్మక ప్రాంతాలతో పాటు ప్రకృతి ప్రదేశాలకు నెలవుగా ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యాటక అభివృద్ధిపై పాలకులు ఎప్పటికప్పుడు మాటలు చెప్పడమే తప్ప ఆ దిశగా పూర్తిస్థాయిలో దృష్టి సారించిన దాఖలాలు లేవు. ఉమ్మడి జిల్లాలో సోమవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటించనున్న నేపథ్యంలో జిల్లాలో పర్యాటక అభివృద్ధి అవకాశాలపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, ఖమ్మం

వివరాలు : 5లో..

'ఆధ్యాత్మిక' అభివృద్ధిపై కనిపించని నజర్

- భద్రాద్రిలో నత్తనడకన 'ప్రసాద్' పనులు
- ట్రైబల్ సర్క్యూట్‌గా జిల్లాను అభివృద్ధి చేయాలి
- నిధుల కేటాయింపులో తీవ్ర అలసత్వం

జయహో మహిళ..

- స్వయం సహాయక యూనిట్ల ఏర్పాటులో ముందున్న ఉమ్మడి జిల్లా
- భద్రాద్రిలో పురోగతిలో 171 యూనిట్లు, పూర్తయినవి 941యూనిట్లు
- ఖమ్మంలో పురోగతిలో 330 యూనిట్లు, పూర్తయినవి 1,366యూనిట్లు
- జీరో వడ్డీతో ప్రతిష్టాత్మకంగా ఇందిరా మహిళా శక్తి పథకం
- రూ. 1లక్ష నుంచి రూ.5లక్షల వరకు రుణాలు మంజూరు
- సత్తుపల్లి డివిజన్‌లో కొత్త యూనిట్లకు ప్రణాళిక



ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 11: ఉమ్మడి జిల్లాలోని స్వయం సహాయక మహిళా సంఘాలు ఇందిరా మహిళాశక్తి పథకంలో రాష్ట్ర స్థాయిలో ముందున్నాయి. క్షేత్ర స్థాయిలో మహిళలు చేస్తున్న వృత్తి, వ్యాపారాలను పరిశీలించి నూతన యూనిట్ల మంజూరుకు ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాచరణ ప్రారంభించారు. మహిళలు తాము చేస్తున్న వృత్తి, వ్యాపార అవసరాల కోసం అధిక వడ్డీతో అప్పుల పాలు కాకుండా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌జీలను నిర్మాణం చేశారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఒక్కో మహిళకు రూ.1 లక్ష నుంచి రూ. 5లక్షల వరకు రాష్ట్ర ప్రభుత్వమే బ్యాంకు లింకేజీ, స్త్రీ నిధి ద్వారా రుణాలను మంజూరు చేస్తోంది. ప్రభుత్వం నిర్ణయించిన సమయానికి రుణాల బకాయిల కిస్తీలు చెల్లించిన మహిళ సంఘాలకు వడ్డీని మాఫీ చేస్తారు. జీరో వడ్డీని అమలు చేస్తారు. మహిళా స్వయం సహాయక సంఘాలు తీసుకున్న అసలు రుణం తిరిగి చెల్లిస్తే సరిపోతుంది.

వ్యవసాయ అనుబంధ రంగంలో ఇలా..

ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా రుణాలను ఇచ్చేందుకు వ్యవసాయ అనుబంధ, వ్యవసాయేతర రంగాలుగా రెండింటిని ఎంపికచేశారు. వ్యవయసాయ అనుబంధంగా పాల ఉత్పత్తి కేంద్రాలు, మొబైల్ చేపలు యూనిట్లు, పాడి గెదేలు, నాటి కోళ్ల పంపకం, చిన్న పిల్లల పెంపకం, ఆహార శుద్ధి పరిశ్రమలు, వ్యవసాయ పనిముట్లు అద్దె కేంద్రాలు, ఫుడ్‌పార్కులు యూనిట్లు మంజూరు జరుగుతాయి. ఖమ్మం జిల్లాలో మొత్తం 3,234 యూనిట్లు లక్ష్యం కాగా 2,519 యూనిట్లు ఏర్పాటుకు కార్యాచరణ చేశారు. 17 యూనిట్లు పురోగతిలో ఉన్నాయి.

వ్యవసాయేతర రంగంలో ఇలా...

వ్యవసాయేతర రంగాల విభాగంలో మీ సేవా కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వాహణ కేంద్రాలు, ఈవెంట్స్ మెనేజ్‌మెంట్స్, మైక్రో ఎంట్రప్రైజెష్, కుట్టు మిషన్లు యూనిట్లు మంజూరు చేస్తారు. ఖమ్మం జిల్లాలో మొత్తం 3,135 యూనిట్లు రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా మంజూరు చేసింది. వీటిలో ఇప్పటికే 330 యూనిట్లు పురోగతిలో ఉన్నాయి. మరో 1,366 యూనట్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెంలో 3,030 యూనిట్లు మంజూరు కాగా 171 యూనిట్లు పురోగతిలో ఉన్నాయి. 941 యూనిట్లు ప్రారంబానికి సిద్ధంగా ఉన్నాయి.

అవసరాల మేరకు మార్పులు

ఇందిరా మహిళా శక్తి పథకాన్ని క్షేత్రస్థాయిలో స్వయం సహాయక సంఘాల అవసరాల మేరకు మార్పులు చేసేందుకు ఖమ్మం కలెక్టర్ ప్రణాళిక సిద్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 14 రకాల యూనిట్లకు మంజూరుకు అనుమతి ఇవ్వగా ఖమ్మం జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాల అనుభవాలను పరిగణలోకి తీసుకున్నారు. సత్తుపల్లి డివిజన్‌లో కొత్త యూనిట్లు ఏర్పాటుకు క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేశారు.

2.8 క్వింటాళ్ల గంజాయి పట్టివేత

- పుష్ప సినిమా తరహాలో తరలింపు

ప్రభుత్వ బడులకు రూ.657కోట్లు

- అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా అభివృద్ధి

4

గ్రానైట్‌కు గడ్డుకాలం...

- ముడిసరుకు లేక మూతపడుతున్న పరిశ్రమలు
- నల్లరాయి క్వారీలకు అనుమతుల్లో కొర్రీలు
- వివిధ కారణాలతో నిరాకరిస్తున్న అధికారులు
- గతంలో 315.361 హెక్టార్లలో తవ్వకాలు
- 2024లో 100 హెక్టార్లకే పరిమితం
- ఖమ్మంలో పడిపోతున్న గ్రానైట్ ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు

5



ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఇంటింటా..

ఫీవర్ సర్వే

- ఆశాలు, ఏఎన్‌ఎంలతో వివరాల సేకరణ
- జ్వరపీడితుల గుర్తింపు.. మందుల పంపిణీ

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 11: జిల్లాలో సీజనల్ వ్యాధులు పెరుగుతున్నాయి. ఇప్పటికే డెంగ్యూ, వైరల్ జ్వరాలతో జనం బెంబేలెత్తుతున్నారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో జ్వరాలతో జనం పరుగులు పెడుతున్నారు. కేసులు అధికంగా నమోదు అవుతుండడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ప్రభుత్వ ఆదేశాలతో అధికారుల పర్యవేక్షణలో సర్వే నిర్వహిస్తున్నారు. వర్షాకాలం నేపథ్యంలో ఆయా పీహెచ్‌సీల పరిధిలో ఆశావర్కర్లతో ఇంటింటి సర్వే చేయిస్తున్నారు. యాంటీ నాటల్ సర్వే, ఫీవర్ సర్వే, ఇమ్యునైజేషన్ టీకా సర్వే చేస్తున్నారు. ఇప్పటికే దోమకాటుతో వచ్చే డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా మెదడువాపు వ్యాధి ఫైలేరియా వివరాలను సేకరిస్తున్నారు. నీటి కాలుష్యం వలన వచ్చే డయేరియా, నీళ్ల విరేచనాలు రక్త విరేచనాలు, కామెర్లు, కోరింత దగ్గు తదితర వ్యాధులపై అప్రమత్తం చేస్తున్నారు. ప్రజలకు దోమల నివారణ చర్యలపైనా అవగాహన కల్పిస్తున్నారు. డెంగీ కేసుల విషయంలో తేలిన వెంటనే రోగి నివాసంతో పాటు పరిసరాల్లో 300 ఇళ్లను ముందస్తుగా ఫీవర్ సర్వే చేసి, కేసులు ఉంటే ప్రభుత్వ ఆస్పత్రికి పరీక్షల కోసం పంపిస్తున్నారు. ఆగస్టులో ఇప్పటి వరకు జిల్లా లోనాలుగు కేసులు వెలుగులోకి వచ్చాయి.

పకడ్బందీగా సర్వే.. డాక్టర్ మాలతి, డీఎంహెచ్‌వో

జిల్లావ్యాప్తంగా ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరపీడితుల వివరాలు సేకరిస్తున్నాం. ఏఎన్ఎం, మెప్మా ఆర్పీలు, సూపర్‌వైజర్లు ఇంటింటికి వెళ్తున్నారు. పారిశుధ్యం పట్ల అవగాహన కల్పించడంతో పాటు, జ్వరపీడితులు వివరాలు సేకరిస్తున్నాం. ఎవరైనా జ్వరం, జలుబు, దగ్గు లాంటి సమస్యలు ఉంటే అక్కడికక్కడే మందులు అందిస్తున్నాం. నీటి నిల్వలను తొలగించాలని సూచిస్తున్నాం. కాచి వడపోసిన నీటిని తాగడంతో పాటు వేడిగా ఉన్న ఆహారపదార్థాలనే తీసుకోవాలి.



కందిమొక్కలకు చిగుళ్లు తుంచుతున్న దృశ్యం

'కంది'లో అధిక దిగుబడులకు చిగుళ్లు తుంచడం మేలైన పద్ధతి

» అందుకు అనువైన సమయం ఇదే..

మధిర, ఆగస్టు 11: వానాకాలంలో సాగుచేసే ముఖ్యమైన అపరాల పంట కంది. ఈ పంటలో అధిక దిగుబడులు సాధించాలంటే వివిధ రకాల యాజమాన్యపద్ధతులు పాటించాలి. అందులో పంట తలకొనలు, చిగుళ్ల త్రుంచడం లేదా నిప్పింగ్ చేయడం ద్వారా ఎంతో ప్రయోజనం చేకూరుతుందని అందుకు ఇది అనుకూల సమయమని మధిర వ్యవసాయ పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రుక్మిణీదేవి తెలిపారు. కంది పంట సాగుచేసిన రైతులకు ఆమె పంట సాగులో పలు సూచనలు వివరించారు.

కంది పంట విత్తిన తర్వాత 45వ రోజు నుంచి 60రోజుల లోపు అంటే మొక్క ఎత్తు 3అడుగుల నుంచి 4 అడుగుల ఎత్తు ఉన్నప్పుడు తల కొనలు, 3 అంగుళాల మేర తుంచేయాలి. ఒక ఎకరం కంది మొక్కల తల కొనలను ఒక మనిషి 3,4 గంటలలో చేయగలడు. ఇలా కంది పంటలో తలకొనలను తుంచడం వలన ప్రక్క కొమ్మలు బలంగా వచ్చి పూత, కాత ఎక్కువగా వస్తుంది. తద్వారా దిగుబడులు పెరుగుతాయి. ఇలా చేయడం వలన గాలి వెలుతురు బాగా ఆడి పురుగులు, తెగుళ్ల ఉధృతి కూడా తగ్గుతుంది. పూత సమయంలో పురుగు మందుల పిచికారి కూడా సులభమవుతుంది. కొనలు తుంచని పొలంతో పోల్చినప్పుడు కొనలు త్రుంచిన పొలంలో 15శాతం అధిగ దిగుబడి వస్తుంది. రైతులు ఈవిధానాన్ని అనుసరించి పంటలో తలలు త్రుంచడం విధిగా చేపట్టాలి.

అధిక వర్షాలు పడుతున్నప్పుడు ఇనుము పోషక లోపంతో కందిపంటలో లేత ఆకులు ఈనెల మధ్య హరిత వర్ణం కోల్పోయి పసుపు రంగులో మారి ఎండిపోతున్నట్లు కనబడితే నివారణకు లీటరు నీటికి 5గ్రా. ఫెర్రస్ సల్ఫేటు (అన్నభేరి) ఒక 5గ్రాముల నిమ్మఉప్పులో కలిపి పైరుపై వారం రోజులు వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేసుకోవాలి. కంది పంటలో ఇనుము లోపం నివారించడంతోపాటు దిగుబడి పెరగటానికి ఈ విధమైన యాజమాన్య పద్ధతి మేలు చేస్తుందని డాక్టర్ రుక్మిణీదేవి తెలిపారు.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ పుష్పార్చన



విరాళం అందజేస్తున్న దృశ్యం

భద్రాచలం, ఆగస్టు 11: భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ఆదివారంను పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, స్వర్ణపుష్పార్చన నిర్వహించారు. నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. దేవస్థానం నిత్యాన్నదాన పథకంకు రంగారెడ్డి జిల్లాకు చెందిన కె.సునీల్ దుర్గేష్, రాధాదేవి దంపతులు రూ.50 వేలను విరాళంగా అందజేశారు.

నేడు ప్రజావాణి కార్యక్రమం రద్దు...

కొత్తగూడెం, ఆగస్టు 11: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మంత్రుల పర్యటన సందర్భంగా సోమవారం కలెక్టరెట్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దుచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి పటేల్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

90శాతం ప్రాజెక్టు పూర్తిచేస్తే ఒక్క ఎకరానికీ ఎందుకు నీళ్లు ఇవ్వలేదు?

» ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభను జయప్రదం చేయాలి

» సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి

సత్తుపల్లి, ఆగస్టు11: సీతారామ ప్రాజెక్టును 90శాతం తామే పూర్తి చేశామని బీఆర్ఎస్ పార్టీ నాయకులు గొప్పలు చెప్పుకొంటుండగా, లక్ష్యంగా పెట్టుకున్న 10లక్షలలో ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఎందుకు ఇవ్వలేకపోయిందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రాయల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం సత్తుపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి 50శాతం పూర్తికానీ ప్రాజెక్టును తక్కువ ఖర్చుతో పూర్తిచేసి గోదావరి జలాలతో సుమారు 1.50లక్షల ఎకరాలను స్థిరీకరిస్తున్నట్లు చెప్పారు. ఇన్నేళ్లు పాటు పరిపాలించిన బీఆర్ఎస్ నాయకులు మేమే చేశామని చెప్పుకోవడం అవివేకమని, నిజాలు తెలుసుకుని తమకు తాము ఆత్మపరిశీలన చేసుకోవాలని కోరారు.

సీఎం రేవంత్‌రెడ్డి సభను జయప్రదం చేయండి

సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో వైరా సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పిలుపునిచ్చారు. చారిత్రాత్మక ఘట్టమైన రెండు జీవనదులను అనుసంధానం చేయడం చారిత్రక ఘట్టమన్నారు. 15వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పంప్‌హౌస్ ద్వారా నీళ్లను వదులుతారని, ఏరియల్ సర్వే ద్వారా కాలువలను పరిశీలిస్తూ మధ్యాహ్నం 1గంటకు వైరాలో జరిగే బహిరంగ సభలో సీఎం పాల్గొనున్నట్లు తెలిపారు. రాష్ట్రప్రజల ఆకాంక్షల మేరకు తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జనసమీకరణ చేయాలని కోరారు. కోరుకుని తెచ్చుకున్న ఇందిరమ్మ రాజ్యంలో ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని గత ప్రభుత్వంపై చాలెంజ్ చేయగా ఆ కలల సాకారం అవ్వనుందని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు మంత్రులు విచ్చేనున్నట్లు చెప్పారు. హరితవిప్లవం తీసుకురావాలని నాటి నెహ్రూ కలలను సాకారం చేయడం, రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన రుణమాఫీ, ప్రజా అవసరాలను తీర్చడం, రైతును అభివృద్ధి చేయడం, అప్పుబారం ఉన్నా రైతులను రుణ విముక్తులను చేయడానికి సీఎం ఆధ్వర్యంలో అహర్నిషలు కృషి చేస్తున్నట్లు చెప్పారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి

ప్రభుత్వ పాఠశాలలకు రూ. 657కోట్లు



ఉపాధ్యాయులతో సమీక్షిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

» అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా అభివృద్ధి

» గత పాలకులు విద్య,వైద్యం పట్ల అశ్రద్ధ

» టీచర్లను, విద్యార్థులను పట్టించుకోలే

» పీఎస్సార్ ట్రస్ట్ ద్వారా పాలేరు విద్యార్థులకు సైకిళ్లు

» రాష్ట్ర రెవెన్యూ, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి, ఆగస్టు 11: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.657 కోట్లు కేటాయించిందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద పనులు పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం ఖమ్మంజిల్లా కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత దశాబ్దకాలంలో గత పాలకులు విద్యవైద్య రంగాలను పూర్తిగా పట్టించుకోకుండా నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు ఇతరత్రా ఏవీ చేయకపోవడంతో ఇబ్బందులు పడ్డారాన్నారు. ఈక్రమంలో అధికారంలోకి వచ్చిన ప్రజాప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో పెద్దపీట వేసినట్లు పేర్కొన్నారు. ఎటువంటి అవకతవకలు లేకుండా 29వేల మంది అధ్యాపకులకు ప్రమోషన్లు, బదిలీలు చేసినట్లు తెలిపారు. చిన్నారులపై భయంకరమైన డ్రగ్స్, మద్యం అలవాటు చేశారని, దీంతో కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని అన్నారు. డ్రగ్స్ మాఫీయాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు పేర్కొన్నారు. చిన్నస్కూల్స్ నుంచి పీజీ కళాశాల వరకు అన్నిప్రభుత్వ విద్యాసంస్థల్లో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. అవసరమైతే వ్యక్తిగతంగా తమ ఫౌండేషన్ ద్వారా ఖర్చులు భరించేందుకు సిద్ధంగా ఉన్నట్లు మంత్రి తెలిపారు. ఉపాధ్యాయులు పిల్లలకు నాణ్యమైన క్రమశిక్షణ కలిగిన విద్య అందించాలని కోరారు.

పాలేరు బడులపై కీలక నిర్ణయం

పాలేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించిన మంత్రి వివిధ గ్రామాల నుంచి ప్రైమరీ స్కూల్స్‌కు వచ్చే విద్యార్థులకోసం పీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లు అందించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది. అందుకు పాఠశాలల్లో సైకిళ్లు అవసరమైన విద్యార్థులను గుర్తించి తనకు నివేదిక అందించాలని ఆదేశించినట్లు సమాచారం. పీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రతి ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తలిపారు. దీనస్థితిలో ఉన్న విద్యార్థులకు ఆరోగ్య పరమైన వైద్య ఖర్చులు భరిస్తామని తెలిపారు. ప్రభుత్వపరంగా కాని పనులకు సొంత ఖర్చు పెట్టనున్నట్లు తెలిపారు.

మంత్రిని కలిసిన విద్యార్థి సంఘాలు

పాలేరు నియోజకవర్గంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీడీఎస్‌యూ విద్యారి సంఘ నాయకులు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిశారు. జేఎన్‌టీయూ కళాశాల భవననిర్మాణాన్ని ప్రారంభించాలని, కూసుమంచిలో జూనియర్ కళాశాల భవననిర్మాణాన్ని ప్రారంభిచాలనిన ర్సింగ్ కళాశాల పనులు వెంటనే పూర్తయ్యేలా చూడాలని, కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే సమస్యలు పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిలా కార్యదర్శి వెంకటేష్, శ్రీకాంత్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో ఆదివాసీ గిరిజనులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొండిచేయి

» మాజీ ఎంపీ మిడియం బాబురావు



దుగ్గి క్రిష్ణను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ మిడియం బాబురావు

కామేపల్లి, ఆగస్టు 11: ఆదివాసీ, గిరిజనులకు నిధులు కేటాయించడంతో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి విఫలమయ్యాయని మాజీ ఎంపీ, ఆదివాసీ గిరిజన కేంద్ర నాయకుడు మిడియం బాబురావు విమర్శించారు. ఆదివారం కామేపల్లిలో జిల్లా గిరిజన నాయకుడు దుగ్గి క్రిష్ణను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల కోసం నిత్యం పోరాడతామని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ఆదివాసీలపై వివక్ష చూపి బడ్జెట్ కేటాయించలేదని అన్నారు. ఏజెన్సీలో ఐటీడీఏలకు నిధులు కేటాయించడంతో ఏజెన్సీలో అభివృద్ధి చెందడం లేదన్నారు. గిరిజన సాధికారిక అనేపేరుతో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ అధికారులు, మంత్రులు గొప్పలు చెప్పుతున్నారు తప్ప ఆచరించడంలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా నాయకులు బండారు రమేష్, ఖమ్మం పీజీ లెక్చరర్ నాగు, దుగ్గి పాపరాణి తదితరులు పాల్గొన్నారు.

మాదినేని భారతమ్మకు తమ్మినేని నివాళి

ఖమ్మంటౌన్, ఆగస్టు 11: సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మాదినేని రమేష్ మాతృమూర్తి మాదినేని భారతమ్మ చిత్రపటం వద్ద సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని నివాళులు అర్పించారు. ఆదవారం నగరంలోని ఎన్నెస్పీ క్యాంప్‌లోని మంచికంటి హాల్‌లో భారతమ్మ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శనరావుతో కలిసి హాజరైన తమ్మినేని మాట్లాడుతూ భారతమ్మ అభ్యుదయ భావాలతో పిల్లలను కూడా వామపక్ష భావాలవైపు నడిపించారని కొనియాడారు.

నాటుసారా రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్



పినపాక, ఆగస్టు 11: ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్‌లో ఆదివారం ఎక్సైజ్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహన తనిఖీల్లో నాటుసారా రవాణా చేస్తూ ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. మణుగూరు ఎక్సైజ్ శాఖ సీఐ రాజిరెడ్డి తెలిపిన వివరాలు.. మండలంలోని ఏడూళ్లబయ్యారం క్రాస్ రోడ్డులో తన సిబ్బందితో కలిసి సీఐ రాజిరెడ్డి వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా వాహనంపై వస్తుండడం గమనించి, తనిఖీలు చేయగా 6 లీటర్ల నాటుసారా లభించిందన్నారు. పట్టుబడ్డ వారిని విచారించగా తమది టేకులగూడెం వలస ఆదివాసీ గ్రామమని, పేర్లు అడపయ్య, బుద్రాలుగా వివరాలు తెలిపారన్నారు. నాటు సారా రవాణాకు వినియోగించిన బైక్‌ను స్వాధీనం, చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ రాజిరెడ్డి తెలిపారు. ఎక్సైజ్ శాఖ నాటుసారా, గుడుంబాలపై ఉక్కుపాదం మోపుతోందని, నిందితులు ఎంతటివారైనా ఉపేక్షించబోమ ని హెచ్చరించారు. తనిఖీలలో సిబ్బంది ప్రసన్నకుమార్, శ్రీను పాల్గొన్నారు.

2.8క్వింటాళ్ల గంజాయి పట్టివేత

» పుష్ప సినిమా తరహాలో గంజాయి తరలింపు

» భద్రాచలం, ఇల్లెందులో పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

భద్రాచలం/ఇల్లెందుటౌన్, ఆగస్టు 11: పుష్ప సినిమా తరహాలో గంజాయి తరలింపునకు పాల్పడుతున్న 155 కేజీల గంజాయిని ఎక్సైజ్ పోలీసు అధికారులు పట్టుకున్నారు. ఆదివారం భద్రాచలంలోని బ్రిడ్జి రోడ్డులో ఉన్న ఎక్సైజ్ చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో భాగంగా ట్రాలీ ఆటోను ఆపి తనిఖీ చేయగా ట్రాక్టర్ అడుగు భాగాన ప్రత్యేకంగా వెల్డింగ్ చేసిన షీట్ల కింద గంజాయిని పేర్చి రవాణా చేస్తున్నారు. దీనిని గమనించి ఆ షీట్లను తొలగించగా గంజాయి రవాణా చేస్తున్నట్లు బయటపడింది. ఈ సమయంలో పట్టుబడిన గంజాయి విలువ రూ.38 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారులు ఎస్.జానయ్య, పి.కరంచంద్, ఎస్కే రహీమున్నీసా, అల్లూరి సీతారామరాజు ఉన్నారు.

53 కిలోల గంజాయి పట్టివేత

ఇల్లెందు టౌన్, ఆగస్టు 11: అక్రమంగా ఒడిషా ప్రాంతం నుంచి ఉత్తరాఖండ్‌కు రవాణా అవుతున్న గంజాయిని ఇల్లెందు పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఆదివారం ఇల్లెందు డీఎస్పీ చంద్రబాను విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఉత్తరాఖండ్ ప్రాంతానికి చెందిన 5గురు వ్యక్తులు ఒడిషా ప్రాంతంనుంచి 53 కేజీల గంజాయి ప్యాకెట్లను కారులో అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు ఇల్లెందు పట్టణ సమీపంలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజి వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న సందర్భంలో అనుమానాస్పదంగా వచ్చిన కారును ఆపారు. కారులో నుంచి ఓ గుర్తు తెలియని వ్యక్తి పరారు అయ్యారని వెంటనే తనిఖీ చేయగా కారులో 53 కేజీల గంజాయి లభ్యమైనట్లు డీఎస్పీ తెలిపారు. పట్టుబడినగంజాయి విలువ రూ.13లక్షలు ఉంటుందని వెల్లడించారు. కారులో ఉన్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. అక్రమ రవాణా పై పోలీసు నిఘా ఉంటుందని హెచ్చరించారు. గంజాయిని పట్టుకున్న సీఐ ఎస్ఐ పోలీసు బృందాన్ని అభినందించారు. ఈ సమావేశంలో ఇల్లెందు సీఐ బత్తుల సత్యనారాయణ, ఎస్ఐ సూర్య నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుకున్న గంజాయితో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది

గుట్కా పట్టివేత

ఆర్టీసీ కార్గో ద్వారా వరంగల్ నుంచి అక్రమంగా దిగుమతి చేసుకున్న ఎంగోల్డ్ పొగాకు, ఆర్ఎండి పాన్ మసాల 160 బాక్స్‌లను స్థానిక బస్టాండ్‌లో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.96 వేలు ఉంటుందని ఇల్లెందు సీఐ సత్యనారాయణ తెలిపారు. ఈసరుకును దిగుమతి చేసుకున్న వ్యాపారి శంకర్ సాహాపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు.

ఖమ్మం ఖిల్లా అభివృద్ధికి మంత్రి తుమ్మల ప్రతిపాదనలు

ఖమ్మం,ఆగస్టు11(ఆంధ్రజ్యోతిప్రతినిధి): పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఖమ్మం జిల్లాకు వస్తున్న నేపథ్యంలో చరిత్రకు నిలయంగా ఉన్న ఖమ్మంఖిల్లా అభివృద్ధికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరారవు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కాకతీయులు నిర్మించిన చరిత్రాత్మక ఖిల్లా పురాతన వైభవం చాటిచెప్పేలా కోట్లాది రూపాయల నిధులు తో అన్ని హంగులుతో పునర్ నిర్మాణం చేపట్టబోతున్నారు. 900 ఏళ్ల క్రితం 4చ.కి.మీ విస్తీర్ణంలో నిర్మించిన ఖిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు విద్యుత్ దీపాలతో సుందరీకరణ, ఖిల్లా చరిత్ర భవిష్యత్ తరాలకు వివరించేలా సూచిక బోర్డుల ఏర్పాటు ఖిల్లా సందర్శనకు వచ్చే పర్యాటకులకు అన్ని హంగులతో ఉండేలా మౌలిక వసతుల ఏర్పాటు, కోటగోడలను శుభ్రపరిచి పునరుద్ధరణ, ఖిల్లాపై రోప్‌వే నిర్మాణంకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఖిల్లా అభివృద్ధికి చేపట్టిన ప్రతిపాదనలు మంత్రి జూపల్లికి నివేదిక ద్వారా అందించనున్నారు. పర్యాటకశాఖ మంత్రి రాక సందర్భంగా ఖమ్మంతోపాటు జిల్లాలో పలు ప్రాంతాల పర్యాటక అభివృద్ధికి చేపడుతున్న చర్యలపై మంత్రి తుమ్మల పర్యాటకమంత్రికి నివేదిక అందించనున్నారు.

అదృశ్యమైన యువతి మృతదేహం లభ్యం..

పాల్వంచ, ఆగస్టు 11: శుక్రవారం అదృశ్యమైన యువతి మృతదేహాన్ని స్థానికులు ఆదివారం ఉదయం గుర్తించారు. వెంటనే వారు పోలీసులకు, యువతి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పాల్వంచ మండలం ఉల్వనూరుకు చెందిన పల్లపు శిరీష(19) శుక్రవారం మేకలు కాయడానికి వెళ్లిన తన తల్లి ఎల్లమ్మకు ఎదురు వెళుతూ అదృశ్యమైన విషయం విధితమే.. కాగా యువతి అదృశ్యమైన ప్రాంతంలో కొద్ది దూరంలో స్థానికులు శిరీష మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకుని ప్రాథమిక విచారణ నిర్వహించారు. మృతదేహాన్ని గుర్తించిన ప్రాంతంలో వాగు దాటుతుండగా శిరీష మృతి చెంది ఉంటుందని అంచనాకు వచ్చారు. దీనికి తోడు శిరీషకు చిన్ననాటి నుంచి నీళ్లంటే భయమని, వాగు దాటే క్రమంలోనే వరద ఉధృతికి కొద్దిదూరం కొట్టుకుపోయి నీటిలో మునిగి మృతి చెంది ఉంటుందని శిరీష తల్లిదండ్రులు, స్థానికులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. విచారణ అనంతరం శిరీష మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

పరీక్ష రాసేందుకు నిందితులకు కోర్టు అనుమతి

ఖమ్మం లీగల్ ఆగస్టు 11: ఖమ్మం నగరంలో ఈ నెల తొమ్మిదిన కింగ్ దర్బార్ హోటల్లో ఫుడ్ ఇన్స్‌పెక్టర్లమని హోటల్ యజమానిని డబ్బులు డిమాండ్ చేసినట్లుగా హోటల్ యజమాని ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఖానాపురంహవేలి పోలీసులు కేసునమోదుచేసి నలుగురు నిందితులను అరెస్టుచేశారు. వారిని ఖమ్మం రెండవ అదనపు ప్రథమశ్రేణికోర్టు న్యాయాధికారి ఏపూరి బిందుప్రియ ఎదుట శనివారం హాజరుపర్చగా నిందితులకు జుడిషియల్ రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కేసులో 3, 4 వ నిందితులైన సఫావత్ యువరాజ్‌సింగ్, అజ్మీర యువరాజ్‌సింగ్ తమకు బీఫార్మసీ పరీక్షలు ఉన్నాయని తమ న్యాయవాది ఎ.యుగంధర్ ద్వారా పిటీషన్ దాఖలు చేయగా పరిశీలించిన న్యాయాధికారి సోమవారం జరిగే పరీక్షలకు జైలు అధికారులు ఎస్కాట్‌తో పరీక్ష రాయించి తీసుకురావలని న్యాయాధికారి ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్టు

పెనుబల్లి, ఆగస్టు 11: పెనుబల్లి మండల పరిధిలోని కుప్పెనకుంట్లలో ఆదివారం వీయం బంజర పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేయగా ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి వద్ద రూ.21,050 నగదు రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఎన్ వెంకటేష్ తెలిపారు పట్టుబడ్డ వారిలో బోబోలు వెంకటకృష్ణ రావర్ల వెంకట దుర్గా శ్రీనాథ్ దొడ్డ కుటుంబరావు బుడ్డి జగన్మోహన్ రావు బొగ్గవరపు సుధాకర్. వీరిలో సుధాకర్‌రావు అదే గ్రామంలో ఓ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు.

ఫోన్ మాట్లాడుతూ.. హీటర్ సంకలో పెట్టుకొని..

● విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ఖమ్మం క్రైం ఆగస్టు 11: విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం సాయంత్రం ఖమ్మం నగరంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలోని కాల్వవడ్డు హనుమాన్ గుడి సమీపంలో నివసించే దోనేపూడి మహేష్ బాబు(40) కొబ్బరికాయల వ్యాపారం చేస్తుంటాడు. తాన పెంపుడు కుక్కకు స్నానం చేయించాలని నీటిని వేడిచేసేందుకు హీటర్‌ను పెట్టి ఫోన్‌రావటంతో ఫోన్ మాట్లాడుతూ హీటర్‌ను నీటిలో బదులు సంకలో పెట్టుకున్నాడు. దీంతో తీవ్ర విద్యుత్ ఘాతానికి గురై అతను అక్కడే పడిపోయాడు. గమనించిన తన కుమార్తె కేకలు వేయటంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు స్విచ్‌ఆఫ్‌చేసి మహేష్‌బాబును ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించటంతో మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చరీలో భద్రపరిచారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు టూటౌన్ పోలీసలు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

● కారును తప్పించబోయి సైడ్ డ్రెయిన్‌లోకి కేఎంసీ ట్రాక్టర్



ట్రాక్టర్‌ను రోడ్డుపైకి నెడుతున్న కేఎంసీ సిబ్బంది

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 11: ఖమ్మం నగరపాలక సంస్థ పారిశుధ్య ట్రాక్టర్ డ్రైవర్ కారును తప్పించ బోయి సైడ్ డ్రైన్‌లోకి వెళ్లి త్రుటిలో ప్రాణాపాయం నుంచి బయటపడిన సంఘటన శనివారం చోటు చేసుకొంది. కేఎంసీకి సంబందిం చిన డంపింగ్‌యా ర్డులో చెత్తను దించి తిరిగి నగరపాలక సంస్థ కార్యాలయంలో ట్రాక్టర్‌ను నిలుపుదల చేసేందుకు వెళ్తున్న ట్రాక్టర్ డ్రైవర్ కార్యాలయం సమీపంలోకి రాగానే ఎదురుగా కారు వచ్చింది. దీంతో కారును తప్పించ బోయి ఓ నివాస గృహం సమీపంలోకి ట్రాక్టర్ వెళ్లింది. సమీపంలోనే ఉన్న సైడ్ డ్రైన్‌లోకి ట్రాక్టర్ వెళ్లింది. ఒక్కసారిగా కుదుపుకు గురికావటంతో ట్రాక్టర్ మీద ఉన్న డ్రైవర్ కిందపడిపోయాడు, సమీపంలోనే ఉన్న కేఎంసీ సిబ్బంది వచ్చి ట్రాక్టర్‌ను బయటకు లాగారు. ఆ సమయంలో ఫుల్‌గా డ్రైవర్ మద్యం తాగి ఉన్నట్లు తెలిసింది. కేఎంసీలో పారిశుధ్య పర్యవేక్షణపై ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు అనేక విమర్శలు చేశారు. అయినా పర్యవేక్షణ పెరగకపోగా రోజు ఏదో ఒక ప్రాంతంలో ఇటువంటి సంఘటనలు వెలుగు చూస్తున్నాయి.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 11: తల్లిదండ్రులు మందలించడంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అశ్వారావుపేటకు చెందిన బి.సాయిశ్యామ్(20) అనే యువకుడు ఖాళీగా ఉంటున్నాడని తల్లిదండ్రులు మందలించారు. మనస్థాపానికి గురైన యువకుడు ఈనెల 8న పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే కుటుంబసభ్యులు అశ్వారావుపేటలో చికిత్స అందించి ఖమ్మం తరలించారు. అక్కడ ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. మృతుడు అవివాహితుడు. ఘటనపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

న్యాయం కోసం బాధితుడి బంధువుల ఆందోళన



సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులు

చింతకాని, ఆగస్టు 11: మండల పరిధిలోని నరసింహపురం గ్రామానికి చెందిన జల్లి రాము మిషన్ భగీరథలో ఆపరేటర్‌గా, ప్రైవేటు ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తు న్నాడు. ఈ నెల 5న చింతకాని గ్రామీణ ఫీడర్ పరిధిలోని ఓ వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్‌కు సాంకేతిక సమస్య తలెత్తటంతో విద్యుత్ సిబ్బంది సూచన మేరకు ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు నిర్వహిస్తున్న రాము ప్రమాదవశాత్తు విద్యుత్ ప్రమాదానికి గురవ్వగా కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చి చికిత్స చేయిస్తున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాము ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. రాము భార్య సరిత వ్యవసాయ కూలీ కాగా వారికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. రోజు వారి కూలీతో జీవిస్తున్న తమకు దిక్కెవరని తన భర్త పరిస్థితికి విద్యుత్ అధికారుల నిర్లక్ష్యమే కారణమని రాము భార్యతో పాటు సుమారు 50 మంది కుటుంబ సభ్యులు ఆదివారం మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు రాము భార్య సరితకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇన్‌ఫార్మర్లు, కోవర్టులతో ప్రజాయుద్ధాన్ని నిర్మూలించలేరు

» సీపీఐ మావోయిస్టు పార్టీ (బీకే - ఏఎస్ఆర్ జిల్లాలు)డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్

» విప్లవ ద్రోహులను, కోవర్టులను సీపీఐ మావోయిస్టు పార్టీ, ప్రజలు క్షమించరని హెచ్చరిక

పినపాక, ఆగస్టు 11: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ పేరుతో వ్యూహాత్మక బహుముఖ దాడులు చేస్తూ, ఇన్‌ఫార్మర్లు, కొరియర్లను తమపై ప్రయోగిస్తూ తాము చేస్తున్న ప్రజాయుద్ధాల్ని నిర్మూలించలేరని పేర్కొంటూ సీపీఐ మావోయిస్టు పార్టీ భద్రాద్రి కొత్తగూడెం - అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శి ఆజాద్ ఆదివారం పత్రికలకు ఓ లేఖ విడుదల చేశారు. ప్రజాయుద్ధాల అణచివేతకు పోలీసులు అనుసరించిన మోసపూరిత ఎత్తుగడలను ఖండిస్తూ, ప్రజా విప్లవ భావజాలంతో సీపీఐ మావోయిస్టు పార్టీ సభ్యుడిగా పని చేస్తున్న కాకర్ల రవికుమార్‌ను లొంగదీసుకుని ఇన్‌ఫార్మర్‌గా తమపైనే ప్రయోగించారని, ఈ క్రమంలోనే రవికుమార్ తమతో పని చేస్తున్న గాలి నారాయణరెడ్డి అలియాస్ రాజ్‌కుమార్, దుండి తేజ అమర్‌నాథ్ అలియాస్ అర్జున్‌ను కోవర్టులుగా తయారు చేసి, విప్లవద్రోహిగా మారాడని పేర్కొన్నారు. దేశంలోని ఆకలి చావులు, నిరుద్యోగాన్ని నిర్మూలించలేని దోపిడి పాలక వర్గాలు, ప్రజా పోరాటాలను నిర్మూలించేందుకు శ్రద్ధ చూపుతున్నాయన్నా రు. అమాయక ఆదివాసీలను, పార్టీ కార్యకర్తలను భయభ్రాంతులకు, ప్రలోభాలకు గురి చేస్తూ ఇన్‌ఫార్మర్లుగా, కోవర్టులుగా తయారు చేసి, వారికి భవిష్యత్తు లేకుండా చేస్తున్నారని లేఖలో ఆరోపించారు. ప్రజాయుద్ధాన్ని నిర్మూలించేందుకు పోలీసులు అమాయకులను కోవర్టులుగా, ఇన్‌ఫార్మర్లుగా ప్రయోగిస్తున్నందున వారి మోసపూరిత మాటలు నమ్మి విప్లవ ద్రోహులుగా మారొద్దని హెచ్చరించారు.

ఆధ్యాత్మిక అభివృద్ధిపై

కనిపించని నజర్

భద్రాద్రిలో నత్తనడకన 'ప్రసాద్' పనులు

- ట్రైబల్ సర్క్యూట్‌గా జిల్లాను అభివృద్ధి చేయాలి
- అభివృద్ధికి నిధుల కేటాయింపులో తీవ్ర అలసత్వం
- ప్రకృతి పర్యాటకాన్ని అందిపుచ్చుకోవడం అత్యావశ్యం
- నేడు మంత్రుల బృందం పర్యటన



భద్రాద్రి రామాలయం

భద్రాచలం, ఆగస్టు 11: పర్యాటకానికి కావాల్సిన హంగులు ఉన్నా, దాన్ని అందిపుచ్చుకోవడంలో అలసత్వం కారణంగా జిల్లాలో టూరిజం అభివృద్ధిలో నత్తనడకే కనిపిస్తున్నది. ప్రకృతి పర్యాటకానికి కొదవ లేకున్నా, పట్టించుకునే వారు కానరాక పరుగులు పెట్టలేకపోతంది. గోదావరి పరవళ్లు, కిన్నెరసాని హొయలు, తాలిపేరు అందాలు ఇలా లెక్కకు మిక్కిలిగా ఉన్న జాబితాకు ఆర్థిక దన్ను కరువవుతోంది. కేంద్ర పర్యాటక శాఖ ప్రసాద్ (తీర్థయాత్ర పునరుజ్జీవనం, ఆధ్యాత్మిక వృద్ధి డ్రైవ్) పథకం కింద అభివృద్ధి పనులను చేపడుతున్నా అవి నత్తనడకన సాగుతున్నాయి.

భద్రాచలాన్ని పట్టించుకోండి...

దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి రామాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని సీఎం రేవంత్‌రెడ్డి భద్రాద్రి పర్యటన సమయంలో ఇచ్చిన హామీతో రామ భక్తుల్లో ఆశలు రేకెత్తాయి. ఇందుకు సంబంధించి ఇప్పటికే క్షేత్రస్థాయిలో కసరత్తు జరిగి పనులు ప్రారంభానికి రంగం సిద్ధమవుతోందని అధికార వర్గాల సమాచారం. ఛత్తీస్‌గఢ్, ఒడిసా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సరిహద్దుల్లోని భద్రాచలంలో హరిత హోటల్ సుమారు రెండున్నర దశాబ్దాల క్రితం నిర్మించగా దాన్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర పర్యాటక శాఖ పూర్తిస్థాయిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాపై దృష్టిసారిస్తే పర్యాటక అభివృద్ధే కాకుండా ఆధ్యాత్మిక పర్యాటకంతో పాటు ట్రైబల్ సర్క్యూట్‌ను సైతం తిలకించేందుకు పర్యాటకులు తరలివచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. భద్రాచల పుణ్యక్షేత్రంలో సోమవారం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావులు పర్యటించనున్న క్రమంలో పర్యాటక రంగానికి భారీగా నిధులు కేటాయించి ఊతమిస్తారని భద్రాద్రి ఏజెన్సీవాసులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

భద్రాచలం, పర్ణశాలలో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రసాద్ పథకం కింద చేపట్టిన పనులు నత్తనడకన సాగుతున్నాయి. 2022 డిసెంబరు 28న రాష్ట్రపతి ద్రౌపదిముర్ము పనులకు శంకుస్థాపన చేయగా, ఏడాదిలో పూర్తికావాల్సిన పనులు ఇంకా పూర్తికాలేదు. పనులు పూర్తి చేసేందుకు అధికారులను గడువు పొడిగింపు అనుమతులు తీసుకున్న కాంట్రాక్టర్ ఆ గడువు లోపు పనులు పూర్తి చేయకపోవడంతో మరో దఫా పనులు పొడిగింపునకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. కాగా పర్ణశాలలో ఇంకా నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు.

అటకెక్కిన రామాయణం థీమ్‌పార్కు

భద్రాచలంలో గతంలో రామాయణ ఇతివృత్తం ఆధారంగా రామాయణం థీమ్ పార్కు నిర్మిస్తామని గత ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వం పేర్కొన్నప్పటికీ అది ఆచరణకు నోచుకోలేదు. ఇందు కోసం ఆనాడు రూ.20 కోట్లతో ప్రతిపాదనలు పంపగా భద్రాచలంలోని రామాయణం థీమ్ పార్కు నిర్మించే చోట భూమిపూజ పనులు సైతం నిర్వహించారు. కాని పోలవరం ముంపు మండలాలు ఏపీ పరిధిలోకి వెళ్లడంతో భద్రాద్రి దేవస్థానం భూములు ఆంధ్రా పరిధిలోకి వెళ్లాయనే సాకుతో ఆ ఊసే మరిచారు. అనంతరం పర్ణశాలలో రామాయణం థీమ్ పార్కు నిర్మిస్తారని ఊహాగానాలు వచ్చినా అవి కార్యాచరణకు నోచుకోలేదు. పర్ణశాలలో సైతం అభివృద్ధి పనులు చేపట్టాల్సి ఉంది. పూర్తి ఏజెన్సీ జిల్లా అయిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను ట్రైబల్ సర్క్యూట్ కింద అభివృద్ధి చేసేందుకు వీలున్నా గత దశాబ్ద కాలంలో ఆదిశగా ప్రయత్నాలు సాగకపోవడం శోచనీయం.



భద్రాద్రిలో నత్తనడకన సాగుతున్న ప్రసాద్ పనులు

ఆధ్యాత్మిక పర్యాటకం మాటేమిటి..

భద్రాద్రి రామాలయ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి భద్రాద్రి పర్యటన సమయంలో ప్రకటించారు. ఈ క్రమంలో క్షేత్రస్థాయిలో పరిశీలనలు, స్థల సేకరణ, మాస్టర్ ప్లాన్ రూపకల్పన తదితర వాటిపై దృష్టిసారించారు. అయితే సీఎం పేర్కొన్నట్లు భద్రాద్రి అభివృద్ధిని త్వరితగతిన చేపడితే ఆధ్యాత్మిక పర్యాటకం మరింత వృద్ధి చెందుతుంది అనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. అలాగే భద్రాద్రి ఆలయ నిర్మాణంలో కీలంగా వ్యవహరించిన భక్తరామదాసు, ఆలయంలో దశవిధ పూజా విధాన రూపకర్త రాజా తూము లక్ష్మీనరసింహదాసుల పేరిట ఉత్సవాలను మరింత ఘనంగా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పటికే రంగనాయకుల గుట్టపై భక్తరామదాసు స్మారకంగా ఉన్న ధ్యాన మందిరంను మరింతగా అభివృద్ధి చేసి బహుళ ప్రాచుర్యంలోకి తేవాలి. అలాగే రాజా తూము నరసింహదాసు స్మారక మందిరంను నిర్మించాలి.

బొగతకు బాసటగా నిలిచేదెన్నడు..

భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వాజేడు మండలం చీకుపల్లి అటవీ ప్రాంతంలో తెలంగాణ నయాగరగా ఉన్న బొగత జలపాతంను తిలకించేందుకు వచ్చే పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలు పెంచాల్సిన అవసరం ఉంది. ఇక్కడ పర్యాటకులు సేద తీరేందుకు మరిన్ని అధునాతన సౌకర్యాలతో గదులు నిర్మించాలి.

గతంలో ఏర్పాటు చేసిన జిప్ సై కిలింగ్, వాకింగ్‌లు నిర్వహణ లోపంతో మూలనపడ్డాయి. బటర్‌ఫ్లై పార్కు సైతం నిర్వహణలో లేదు. పిల్లల పార్కు అస్తవ్యస్తంగా ఉంది. బొగత జలపాతం వద్ద గత ఎనిమిదేళ్లలో 20 మందికి పైగా పర్యాటకులు మృతి చెందారు. ఈ క్రమంలో అక్కడ రక్షణ ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టిసారించి సిబ్బందిని పెంచాలి.

కళారంగ సమస్యల పరిష్కారానికి కృషి

▸ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ▸ ముగిసిన తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలు



కృష్ణప్రసాద్‌కు స్తంభాద్రి పురస్కారాన్ని అందిస్తున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 11: కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నెలనెల వెన్నెల 7వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీల కార్యక్రమం ఆదివారంతో ముగిశాయి. నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి పొంగులేటి హాజరై మాట్లాడారు. కళలను ఇంతటి అద్భుత స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కళా సాంస్కృతిక సంస్థ, కళా పరిషత్, ప్రజా నాట్య మండలి సభ్యులను అభినందించారు. కళలకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం నెలకు రూ. రెండు లక్షలు అందిస్తుందని, భవిష్యత్తులో మరింత ప్రో త్సాహం అందించేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం రంగస్థల సీనియర్ కళాకారులు, నటులు పూతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్‌ను సన్మానించి స్తంభాద్రి అవార్డును అందించారు. కృష్ణప్రసాద్ లాంటి కళాకారులు ఉన్నారు కాబట్టే, కళలు జీవం పోసుకుంటున్నాయి అని అన్నారు. ముగింపు సందర్భంగా నిర్వహించిన ఇంద్రప్రస్థం, అనూ హ్యం, పాశం నాటికలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులను, ముఖ్య అతిథులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో దయాకరెడ్డి, కర్నాటి కృష్ణ, కురువెళ్ళ ప్రవీణ్, నాగబత్తిని రవి, వేల్పుల విజేత, సుబ్రమణ్యకుమార్, జగన్మోహన్‌రావు, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

'యువశక్తిని నిర్వీర్యం చేస్తున్న పాలకులు'



సమావేశంలో మాట్లాడుతున్న మిడియం బాబురావు

ఖమ్మంటౌన్, ఆగస్టు 11: దేశంలో 60శాతం ఉన్న యువశక్తిని పాలకులు నిర్వీర్యం చేస్తున్నారని మాజీ ఎంపీ, గిరిజన సంఘం ఆల్ ఇండియా ఉపాధ్యక్షుడు మిడియం బాబురావు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు నున్నా నాగేశ్వరరావు విమర్శించారు. ఆదివారం ఖమ్మంలో ప్రారంభమైన డీవైఎఫ్ఐ జిల్లా రాజకీయ శిక్షణా తరగతుల్లో వారు పాల్గొని మాట్లాడుతూ పాలకులు అవలంభిస్తున్న మతోన్మాద, పెట్టుబడిదారీ విధానాలకు వ్యతిరేకంగా యువత ఉద్యమించాలన్నారు. ఉద్యోగం, ఉపాధి అవకాశాలు కల్పించకుండా యువతను నిర్వీర్యం చేస్తున్నారని, దీనివల్ల అభివృద్ధిలో వెనుకబడుతున్నామన్నారు.

రాజకీయ శిక్షణా తరగతులు యువతకు ఎంతో ఉపయోగపడతాయని, భవిష్యత్తులో మరిన్ని పోరాటాలకు దిశానిర్దేశనం చేస్తుందన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దెల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ శిక్షణా తరగతుల్లో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, జిల్లానాయకులు చింతల రమేష్, శీలం వీరబాబు, సత్తెనపల్లి నరేష్, నవీన్, సుజాత, పలువురు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

'సీతారామ'కు 67 టీఎంసీల

గోదావరి జలాల కేటాయింపు

▸ త్వరలోనే రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

▸ మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

▸ వైరాలో రైతు బహిరంగ సభ ఏర్పాట్ల పరిశీలన



మాట్లాడుతున్న మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వైరా, ఆగస్టు 11: సీతారామ ప్రాజెక్టు ద్వారా 67టీఎంసీల గోదావరి జలాల వినియోగానికి కేంద్రం నుంచి అనుమతులు తీసుకున్నట్లు నీటిపారుదలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. 2026నాటికి సీతారామ ప్రాజెక్టు కింద నిర్దేశించిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మొత్తం ఆయకట్టుకు గోదావరి జలాలు సరఫరా చేస్తామని ప్రకటించారు. 15న వైరాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొనే రైతు బహిరంగ సభ ఏర్పాట్లను ఆదివారం మంత్రులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 15వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి సీతారామ ప్రాజెక్టు మూడు పంపుహౌజ్‌లను ప్రారంభిస్తారన్నారు. ఆ రోజు చరిత్రాత్మక రోజుగా మిగిలిపోతుందన్నారు. ఇప్పటివరకు సీతారామ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాతనే అనుమతులు తీసుకువచ్చిందన్నారు. సాగర్‌నీళ్లు రాని సమయంలో సీతారామ ద్వారా గోదావరి జలాలు తీసుకువచ్చి ఎన్నెస్పీ చివరి భూములకు సాగునీరందిస్తామని తెలిపారు. ఇప్పటివరకు సీతారామ ప్రాజెక్టు ప్యాకేజీ-1నుంచి 8వరకు ప్రధాన కాల్వలో జరిగిన పనుల వివరాలను వెల్లడించారు. ప్రధాన కాల్వ 110నుంచి 112కిలోమీటర్ మధ్య జూలూరుపాడ్ టన్నెల్‌ను 1.65కిలోమీటర్లు త్వరితగతిన నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. దాన్ని పూర్తిచేసి పాలేరు లింక్ కెనాల్‌కు నీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాలేరు దీని ద్వారా 42వేల ఎకరాల నూతన ఆయకట్టు సాగులోకి రావడమేకాకుండా పాలేరు కింద ఉన్న సాగర్ ఆయకట్టుకు కూడా నీరందిస్తామని తెలిపారు. 15వ తేదీన రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా గోదావరి జలాలను కృష్ణా జలాలతో అనుసంధానం చేస్తామని తెలిపారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తలాతోకా లేకుండా కాల్వలకు కుక్కగోతుల్లా తీసిందని విమర్శించారు. కొత్త రెవెన్యూ చట్టాన్ని సవరించి కొత్త చట్టాన్ని తెచ్చామని తెలిపారు. 80వేల పుస్తకాలు చదివిన మేధావి, దొర అయిన వ్యక్తి కూడా కొత్త రెవెన్యూ చట్టానికి సలహాలు ఇస్తే వాటిని కూడా పరిగణలోకి తీసుకుంటామని పరోక్షంగా కేసీఆర్‌నుద్దేశించి వ్యాఖ్యానించారు. ఎల్ఆర్ఎస్ విషయంలో 25లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రజలకు ఇబ్బంది లేకుండా వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. తొందర్లో కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. సమావేశంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు పాల్గొన్నారు.

పర్యాటకం పట్టాలెక్కేనా ?

ఖమ్మం, ఆగస్టు 11:(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లాకు గుమ్మంగా ఉన్న పాలేరు నియోజకవర్గంలో పర్యాటక ప్రదేశాలు అనేకం ఉన్నాయి. పాలేరు రిజర్వాయర్‌లో బోటింగ్‌తో పాటు వాటర్ గేమ్స్, స్పీడ్‌బోట్లు ఏర్పాటు చేసే సౌలభ్యం ఉంది. పాలేరు రిజర్వాయర్‌లో మధ్యలో ఉన్న దీవిని అభివృద్ధి చేసి ఉదయం నుంచి సాయంత్రం వరకు వాటర్‌పాల్స్, ఫిష్‌హంటింగ్, బోటింగ్, గెస్ట్‌హౌస్‌లు, పిల్లలు ఆడుకునేందుకు క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తే పెద్ద సంఖ్యలో పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉంది. సెయిలింగ్ వంటి క్రీడలకు ఇక్కడ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. కూసుమంచిలో కాకతీయుల కాలం నాటి శివాలయం కూడా ఉంది. ఎంతో చారిత్రక ప్రాధాన్యం కలిగిన గణపేశ్వరాలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో విచ్చేస్తుంటారు. ఈ ఆలయాన్ని కాకతీయ గణపతిదేవుడు నిర్మించాడు. నేలకొండపల్లి మండలంలో బౌద్ధుల కాలం నాటి స్థూపం ఉంది. ఇది మన ప్రాచీన చరిత్ర, సంస్కృతికి నిలయంగా ఉంది. భద్రాచలం ఆలయం నిర్మించి నిజాం తానీషా చే బందీకి గురైన భక్తరామదాసు జన్మస్థలం కూడా నేలకొండపల్లినే.. ఇక్కడ భక్తరామదాసు ఇల్లు కూడా పర్యాటక ప్రదేశంగా ఉంది. భద్రాచలం సీతారామచంద్ర స్వామి భక్తుడైన రామదాసు 1664లో భద్రాచలం ఆలయాన్ని నిర్మించారు. అటువంటి భక్తరామదాసు పుట్టిన ప్రదేశాన్ని కూడా పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. దీని అభివృద్ధి కోసం గతంలో మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు, కేంద్ర మాజీమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి కొంత నిధులు కేటాయించారు. కానీ పూర్తిస్థాయిలో పనులు జరపలేదు. రెండో శతాబ్దంకాలం నాటి బౌద్ధస్థూపం దక్షిణ భారతదేశంలోనే ప్రత్యేకంగా గుర్తింపు పొందింది. నేలకొండపల్లి బౌద్ధస్థూపం పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే ఇక్కడ ఒక బౌద్ధబోధన లైబ్రరి, ధ్యానమందిరం, గుహలు నిర్మించి విద్యార్థుల మానసిక వికాసం పెంపొందించేలా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. ఇక ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల మధ్య ప్రవహిస్తున్న మున్నేరుకు రెండువైపులా కరకట్టలు నిర్మిస్తున్నందున ఇక్కడ రివర్ టూరిజం, చెక్‌డ్యాంల నిర్మాణం అవసరం ఉంది.

ఖమ్మం ఖిల్లా చరిత్రకు సాక్ష్యం..

ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో కూడా ఎన్నో పర్యాటక ప్రదేశాలు, ఆలయాలున్నాయి. కాకతీయుల కాలంలో నిర్మించిన ఖిల్లా, స్తంబాద్రి లక్ష్మీ నర్సింహస్వామి ఆలయం కూడా చారిత్రక ప్రాధాన్యాన్ని కలిగి ఉంది. ఖమ్మం ఖిల్లాకు కాకతీయుల పాలనలో క్రీ.శ.950లో ఖమ్మం మెట్టుగా పునాదులు పడి కోటగా నిర్మించిన తర్వాత 400 ఏళ్ల కాకతీయుల పాలనలో, తర్వాత రెడ్డిరాజులు, పద్మనాయకరాజులు, ముసునూరు రాజులు అనంతరం కుతుబ్‌షాహీ వంశస్తులు పాలించారు. శతాబ్దాల చరిత్ర ఉన్న ఖమ్మంఖిల్లాను అలనాటి పూర్వవైభవం చూపించి డాక్యుమెంటరీ తయారుచేసి ఖిల్లాపై ఒక థీమ్‌థియేటర్ ఏర్పాటుచేసి సందర్శకులకు తెలియచేయాల్సిన అవసరం ఉంది. వృద్ధులు సైతం ఎక్కేందుకు లిఫ్టు నిర్మాణం, తాగునీరు, ఇతర వసతులు కల్పించి అలనాటి చరిత్రను తెలిపే వారసుల విగ్రహాలను ఏర్పాటు చేస్తే ప్రముఖ పర్యాటక ప్రదేశంగా ఖిల్లా అభివృద్ధి చెందనుంది. అలాగే ఖమ్మంలో స్తంబాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయం కూడా కాకతీయులు ప్రతాపరుద్రుని కాలంలో నిర్మించారని చెబుతుంటారు. కాకతీయుల శిల్పాకళా శైలి ఆకట్టుకునే రీతిలో ఈ ఆలయం నిర్మించారు. అలనాటి చరిత్రను చాటిచెబుతున్న ఈ ఆలయానికి నిధులు కేటాయించి బస్సులు ఆలయంపైకి వెళ్లేలా ఏర్పాటు చేస్తే నిత్యం ప్రతిరోజు పర్యాటకులు, భక్తులు వచ్చే అవకాశం ఉంది. అలాగే ఖమ్మం పట్టణంలో లకారం చెరువు కూడా కాకతీయుల కాలంనాడే నిర్మించింది. ఇప్పటికే లకారం చెరువును అభివృద్ధి చేశారు. అయితే పర్యాటకులు వచ్చేలా బోటింగ్, షిప్పింగ్ లేజర్ గేమ్స్, పిల్లలు ఆడుకునేందుకు స్థలాలు, సాయంత్రం సాసంస్కృతిక కార్యక్రమాలు ఆడిటోరియంతో పాటు ఇతర సౌకర్యాలు సమకూర్చాలి. తద్వారా పర్యాటకంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. ఖమ్మంలోని వెలుగుమట్ల అర్బన్ ఫారెస్టు పార్క్ సుమారు 400 ఎకరాల్లో విస్తరించి ఉంది. అడువుల ఆవశ్యకత, అటవీప్రాంతంలో దొరికే పూలు, పండ్లు, అడవుల్లో నివసించే జంతువులు, పక్షులు అనేకజాతులు నివసించేలా జూపార్కుతోపాటు పలు సౌకర్యాలు కల్పించడం, అటవీ ఉత్పత్తులతో వంటకాలు ఏర్పాటు చేస్తే పర్యాటకులు వచ్చే అవకాశం ఉంది. ఎకో టూరిజం మాదిరి అటవీ వెదురుతో గెస్ట్‌హౌజ్‌ల నిర్మాణం, అడవుల ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణపై ఇక్కడ విద్యార్థులకు అవగాహన కల్పించేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది.

వైరా రిజర్వాయర్

వైరా రిజర్వాయర్ కూడా బోటింగ్‌తో పాటు ఇతర పర్యాటక నిర్మాణాలకు అవకాశాలకు నెలవుగా ఉంది. వైరాలో బోటింగ్‌తో పాటు సెయిలింగ్ క్రీడను కూడా ఏర్పాటుచేసే అవకాశం కలుగుతుంది. అలాగే ఏన్కూరు, తల్లాడ, పెనుబల్లి మండలాల్లో కొండలను పర్యాటకంగా తీర్చిదిద్దేందుకు నిధులు కేటాయించారు. పాల్వంచలోని అభయారణ్యం, కిన్నెరసాని పార్కు, బోటింగ్‌తోపాటు పర్యాటకులు వచ్చి ఉండేలా సౌకర్యాలు కలిపస్తే ఇక్కడ పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. కొత్తగూడెం సింగరేణి, కేటీపీఎస్, నవభారత్, ఐటీసీ బీపీఎల్, హెవివాటర్ ప్రాజెక్టుతో ఇండస్ట్రియల్ టూరిజం ఏర్పాటుకు అవకాశాలున్నాయి.



పర్ణశాలలోని సీతాకుటీరం

భద్రాచలం పర్ణశాల

అలాగే దేశంలోనే గుర్తింపు పొందిన భద్రాచలం సీతారామచంద్రస్వామి పుణ్యక్షేత్రం పర్యాటకంగా మరింత అభివృద్ధి చేస్తే భద్రాచలం ఒక టూరిస్టు హబ్‌గా మారనుంది. భద్రాచలంతో పాటు పర్ణశాల కూడా సీతమ్మవారి వనవాసానికి సంబంధించి కుటీరాల నిర్మాణం, వెదురుబొంగు, గడ్డితో ప్రత్యేక విశ్రాంతి గృహాలు నిర్మిస్తే గోదావరి తీరాన పర్ణశాల సన్నిధిలో ప్రశాంతంగా అరణ్యవాసం పర్యాటకంగా భక్తిపరంగా ఆకట్టుకునే అవకాశం ఉంది. అలాగే భద్రాచలం నుంచి పర్ణశాలకు కూడా 30కి.మీ నాలుగులైన్ల రహదారి నిర్మించి సెంట్రల్‌లైటింగ్ కలిపిస్తే నిరంతరం పర్యాటకుల వాహనాల రాకపోకలకు అవకాశం ఉంటుంది మధ్యలోని యటపాకనుంచి తూరుబాక వరకు 9కి.మీ. రహదారి ఉంది. తెలంగాణ ఆంధ్రా రాష్ట్రాలు నాలుగులైన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు చొరవ తీసుకోవాలి. పర్ణశాలలో గోదావరి వద్ద బోటింగ్ ఏర్పాటు లాంచీల సౌకర్యం ఏర్పాటుచేయాలి. భద్రాచలం పుణ్యక్షేత్రంలో పర్యాటకులకు, భక్తులకు అదనపు కాటేజీల నిర్మాణం, భద్రాచలం పాపికొండలు విహారయాత్ర, భద్రాచలం సమీపంలోని మోతిగడ్డ వీరన్న ఆలయాన్ని కూడా పర్యాటకంగా అభివృద్ధి చేసి గోదావరిపై భద్రాచలం నుంచి మోతిగడ్డ వరకు రోప్‌వే ఏర్పాటుచేస్తే పర్యాటకులు పెద్దసంఖ్యలో వెళ్లే అవకాశం ఉంది. గోదావరి ఇసుకలో ఒంటెలు, గుర్రాలు, ఇసుకలో నడిచే వాహనాలను ఏర్పాటు చేసి పర్యాటకులు వేసవికాలంలో భద్రాచలం నుంచి మోతిగడ్డ వెళ్లేందుకు సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇలా ఉమ్మడి ఖమ్మం జిల్లాను పర్యాటకంగా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తే ఉమ్మడి ఖమ్మం పర్యాటకులకు గుమ్మంగా నిలవనుంది.

అప్పారావుకు సేవారత్న అవార్డు



సేవారత్న అవార్డు అందుకుంటున్న అప్పారావు

ఖమ్మం ఖానాపురంహవేలి ఆగస్టు 11: ఖమ్మం నగరంలోని శ్రీ శాస్త్ర దేవస్థానం ట్రస్ట్ సభ్యుడు తుమ్మలూరి అప్పారావు గురుస్వామి సేవారత్న అవార్డును అందుకున్నారు. తమిళనాడులోని కాంచీపురంలో ఆదివారం నిర్వహించిన అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ, శరణ వీధి కార్యక్రమంలో అయ్యప్ప సేవారత్న పురస్కారాన్ని ఆయనకు అందించారు.

గ్రానైట్‌కు

గడ్డుకాలం..

▸ ముడిసరుకు లేక మూతపడుతున్న పరిశ్రమలు

▸ ఖమ్మంలో పడిపోతున్న గ్రానైట్ ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు



మూతపడిన టైల్స్ పరిశ్రమ

ఖమ్మం ఖానాపురం హవేలీ, ఆగస్టు 11: ఖమ్మం జిల్లాలో ఉన్న ఏకైక పరిశ్రమ గ్రానైట్ పరిశ్రమకు గడ్డుకాలం దాపురించింది. ఒకప్పుడు ఖమ్మం బ్లాక్ గ్రానైట్ ఉత్పత్తులు ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసిన ఖమ్మం పరిశ్రమలు నేడు ముడిసరుకు లేక మూతపడతున్నాయి. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 480 వరకు స్లాబ్ గ్రానైట్ పరిశ్రమలు, 170 వరకు గ్రానైట్ టైల్స్ పరిశ్రమలతో కళకళలాడే పరిశ్రమ నేడు 150 గ్రానైట్ స్లాబ్ పరిశ్రమలు, 60 గ్రానైట్ టైల్స్ పరిశ్రమలు అంతంత మాత్రంగా నడుస్తున్నాయి. కారణాలు అనేకం ఉన్నా ప్రధానంగా గ్రానైట్ క్వారీల లీజులు తగ్గటంతో ఈ సమస్య తలెత్తుతోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు రాజస్థాన్, గుజరాత్, ఒడిస్సా, బెంగాల్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, తదితర రాష్ట్రాల కార్మికులు ఖమ్మంలోని గ్రానైట్ పరిశ్రమల్లో పనులు చేసేవారు. కాని ప్రస్తుతం జిల్లాలోని కార్మికులకు పనిదొరకని పరిస్థితి నెలకొంది. ముడిసరుకు గ్రానైట్ ఉత్పత్తిలో ఖమ్మం జిల్లా ఉమ్మడి రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉండేది. అలాంటిది రాష్ట్ర విభజన తర్వాత మరింత ఊపందుకోవాల్సింది పోయి రోజురోజుకు దిగజారుతోంది.

200 నుంచి 40కి పడిపోయిన క్వారీలు

ఖమ్మం జిల్లాలో గ్రానైట్ తవ్వకాలు, ఎగుమతులతో ఎంతో సందడి ఉండేది. లక్షాలాది మంది కార్మికులకు ఉపాధి లభించేది. కానీ కాలక్రమేణా తవ్వకాలు తగ్గిపోవడంతో ఆ ప్రభావం స్థానిక అభివృద్ధిపై పడటంతోపాటు ఉపాధి అవకాశాలు లేక కార్మికులు ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. 2000 సంవత్సరానికి ముందు ఖమ్మంజిల్లాలో 200క్వారీలకు పైగా ఉండగా. ప్రస్తుతం వాటి సంఖ్య 40కు పడిపోయింది. ప్రభుత్వ ఆధీనంలోని 188.43 హెక్టార్ల భూమిలో, 148,928 హెక్టార్ల పట్టాదారు (ప్రైవేట్) భూమిలో క్వారీలు నడిచేవి. అంటే మొత్తం ప్రభుత్వం, ప్రైవేటు కలిసి 315,361 హెక్టార్లలో గ్రానైట్ క్వారీలకు లీజులు ఉండేవి. కానీ 21ఏళ్లు గడిచే సరికి ప్రస్తుతం ప్రభుత్వ ప్రైవేట్ కలిపి మొత్తం 100హెక్టార్లలో మాత్రమే గ్రానైట్ లీజులు నడుస్తున్నాయి. అంటే మొత్తం మూడు వంతుల్లో రెండు వంతుల వ్యాపారం తగ్గిపోగా, 214 హెక్టార్ల భూమిలో గ్రానైట్ తవ్వకాలు నిలిచిపోయాయి.

అనుమతులు రద్దు..

ప్రభుత్వం పల్లెప్రకృతి వనాలు, పేదలకు ఇళ్ల ప్లాట్లు, డబుల్ బెడ్రూంలకు, వివిధ ప్రభుత్వ భవనాలకు భూములు కేటాయించిన కారణంగా వందల సంఖ్యలో గ్రానైట్ క్వారీలకు అనుమతులు రద్దుచేసింది. పర్యావరణ అనుమతులను తప్పనిసరి చేస్తూ జీవోలు తీసుకురావడంతో క్వారీ లీజులు ఏళ్లతరబడి దరఖాస్తుల దశలోనే మిగిలిపోతున్నాయి. కొన్ని క్వారీలకు సమీపంలో పురాతన గుడులు ఉండటంతో ఆ ప్రభావం క్వారీలపై పడింది.

పలు రకాల అడ్డంకులు

ఖమ్మం రూరల్ మండలంలోని పోలేపల్లి గ్రామంలో, నేలకొండపల్లి మండలం మండ్రాజుపల్లి గ్రామంలోని గ్రానైట్ క్వారీల్లో ఇంకా పదేళ్లకు సరిపడా నాణ్యమైన గ్రానైట్ రాళ్ల నిల్వలున్నాయి. అయినా ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడంతో క్వారీలు నడపడం లేదు. ఖమ్మం రూరల్ మండలం రెడ్డిపల్లి గ్రామం మారెమ్మ గుడి ఎదురుగా ఉన్న ఓ గ్రానైట్ క్వారీకి సంబంధించి ప్రస్తుతం లీజులో నడుస్తున్నా దానికి ఆనుకుని ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇవ్వడంతో రానున్న రోజుల్లో ఈ క్వారీ గ్రానైట్ రాళ్లను వెలికి తీసేందుకు ఇబ్బందులు తప్పవని గ్రానైట్ క్వారీ యజమానులు ఆందోళన చెందుతున్నారు. గుర్రాలపాడు ప్రాంతంలో లీజులో నడుస్తున్న క్వారీ వెంట స్థలాన్ని ప్రభుత్వం పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లకు ఇవ్వడంతో క్వారీకి ఆనుకుని గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు. దీంతో క్వారీ నిర్వహణ ఇబ్బంది కరంగా మారింది.

లేదు. ఇకనైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి విలువైన గ్రానైట్‌ను వెలికి తీసేలా క్వారీలకు అనుమతివ్వాలని, అందుకు ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది. లీజులను సరళీకృతం చేసి ఐదు హెక్టార్ల వరకు పర్యావరణ అనుమతులతో సంబంధం లేకుండా ఇవ్వాలని పరిశ్రమల నిర్వాహకులు కోరుతున్నారు. చిన్నచిన్న నల్లరాయి గుట్టలకు తాత్కాలిక అనుమతులు ముంజూరు చేసి గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతిపై చర్యలు

▸ డిప్యూటీ వార్డెన్ సస్పెన్షన్..హెచ్‌ఎంకు షోకాజ్ నోటీసులు జారీ చేసిన ఐటీడీఏ పీవో




నగదును అందజేస్తున్న ట్రైకార్ జీఎం శంకర్‌రావు

దుమ్ముగూడెం, ఆగస్టు11: కొత్తపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థి మృతికి కారకులుగా భావిస్తూ హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్లపై చర్యలు చేపడుతూ ఐటీడీఏ పీవో రాహుల్ ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ వార్డెన్ బి.హరికృష్ణను సస్పెండ్ చేయగా, హెచ్‌ఎం వి.నర్సింహారావుకు షోకాజ్ నోటీసుతో పాటు ఆర్టికల్ ఆఫ్ చార్జెస్‌ను ఫ్రేమ్ చేశారు. పదిరోజుల్లోగా వివరణ ఇవ్వాలని హెచ్‌ఎంను కోరారు. వివరాల ప్రకారం..ఈనెల 10న తాము చదువుతున్న కొత్తపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల నుంచి ఆటోలో ఇళ్లకు వెళ్తూ మార్గ మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో బండారుగూడేనికి చెందిన కుంజా దీపక్(13) అనే విద్యార్థి మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన మరో ముగ్గురు విద్యార్థులు గాయపడిన విషయం తెలిసిందే. విధుల పట్ల నిర్లక్ష్యం, పాఠశాల నిర్వహణలో వైఫల్యం వహించినందుకు గానూ అనుమతి లేకుండా విద్యార్థులను ఇళ్లకు పంపడం వంటి పలు కారణాలకు హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్లను బాధ్యులను చేస్తూ, చర్యలు చేపట్టారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు జరిగిన ప్రమాదంపై ఏటీడీవో అశోక్ ఇచ్చిన సమగ్ర నివేదిక మేరకు తక్షణమే చర్యలు చేపట్టాలని డీడీ మణెమ్మను పీవో ఆదేశించారు.

ఆశ్రమపాఠశాలను సందర్శించిన ట్రైకార్ జీఎం

కొత్తపల్లి గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలను ట్రైకార్ జనరల్ మేనేజర్ కుంజా శంకర్‌రావు ఆదివారం సందర్శించారు. తొలుత విద్యార్థి కుంజా దీపక్ మృతికు సంతాపంగా విద్యార్థులతో కలిసి మౌనం పాటించారు. టీచర్లు, వర్కర్లు అందరూ విద్యార్థులను దత్తత తీసుకొని వారిని అభివృద్ధిలోకి తీసుకురావాలని సూచించారు. పాఠశాల ప్రహరీ ఎత్తును పెంచేందుకు అవసరమైన నిధుల కేటాయింపు కోసం టీడబ్ల్యూ కమిషనర్‌తో మాట్లాడి మంజూరు చేయిస్తానన్నారు. క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలని కోరారు. వాలీబాల్ క్రీడా సామాగ్రి కొనుగోలు చేసేందుకు విద్యార్థులకు రూ.వెయ్యి నగదును అందజేశారు. విశ్రాంత టీచర్లు పూనెం వీరభద్రం, పూనెం నాగేశ్వరావు, కుర్సం లక్ష్మణరావు, లక్ష్మయ్య, లక్‌పతి తదితరులు పాల్గొన్నారు.



నేడు జిల్లాకు ముగ్గురు మంత్రుల రాక

ఆంధ్రజ్యోతి కొత్తగూడెం, అగస్టు 11: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించేందుకు సోమవారం ముగ్గురు మంత్రులు జిల్లాకు రానున్నారు. డిప్యూటీ సీఎం మల్లుబట్టి విక్రమార్క, ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించనున్నారు. హైదరాబాద్ బేగం పేట నుంచి హెలికాప్టర్ ద్వారా బయలు దేరి ఉదయం 9.45 గంటలకు ఖమ్మం జిల్లాలోని నేల కొండపల్లి బుద్ధస్థూపం పర్యటక శాఖ తరుపున పనులను పరిశీలించనున్నారు. ఖమ్మం ఖిల్లాను ఉదయం 10.20గంటలకు సందర్శించనున్నారు. ఉదయం 11.40గంటలకు వైరాను టూరిజం స్పాట్‌గా అభివృద్ధి చేయడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించడానికి వైరా ప్రాజెక్టును సందర్శించనున్నారు. మధ్యాహ్నం 1.30గంటలకు భద్రాచలం రామాలయాన్ని సందర్శించనున్నారు. మధ్యాహ్నం 3.10గంటలకు పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్టును సందర్శించనున్నారు. 5గంటలకు కొత్తగూడెం బడ్జెట్ హోటల్, కన్వెన్షన్ హాల్‌ను పరిశీలించనున్నారు.

గ్రామ దేవతలకు బోనాల సమర్పణ

చల్లంగా చూడాలని అమ్మవారిని వేడుకున్న మహిళలు



జూలూరుపాడులో బోనాలతో వస్తున్న మహిళలు



అశ్వాపురం మండలం మల్లెమడుగులో

జూలూరుపాడు, ఆగస్టు 11: శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని కరివారిగూడెం కాలనీలో గ్రామదేవత ముత్యాలమ్మ తల్లికి మహిళలు బోనాలను సమర్పించారు. బోనాలతో మహిళలు ఆలయం వద్దకు ప్రదర్శనగా వెళ్లి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులను చెల్లించుకున్నారు. అదే విధంగా మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో ముత్యాలమ్మ తల్లి ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ఆళ్లపల్లిలో..

ఆళ్లపల్లి: మర్కోడు గ్రామంలో ఆదివారం మహిళలు ముత్యాలమ్మకు బోనాలు సమర్పించారు. మహిళలు బోనాలతో ప్రదర్శనగా బయలుదేరి గ్రామ శివారులోని ముత్యాలమ్మకు మొక్కులు చెల్లించారు. పాడి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరు ఆరోగ్యంగా ఉండాలని భక్తులు ముత్యాలమ్మను కోరుకున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకన్న, బాబు, కృష్ణహారి, రవికుమార్, సతీష్, నాగేష్, రాంమూర్తి పాల్గొన్నారు.

అశ్వాపురంలో..

అశ్వాపురం: తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే శ్రావణ మాస బోనాల ఉత్సవాలను ఆదివారం మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. మండల పరిధిలోని మొండికుంట, మల్లెలమడుగు, సీతారాంపురం, జగ్గారం, అశ్వాపురం, కల్యాణపురం, రామచంద్రాపురం గ్రామాల్లో మహిళలు పెద్దఎత్తున గ్రామదేవతలకు బోనాలు, నైవేద్యాలు సమర్పించారు. అమ్మవారి సన్నిధిలో పసుపు, కుంకుమ, చీరెలు, గాజులు ఉంచి తమను సౌభాగ్యాలతో, పసిడి పంటలతో చల్లంగా చూడాలని వేడుకున్నారు. డప్పు వాయిద్యాలతో గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

కరకగూడెంలో..

కరకగూడెం: మండలంలో ఆదివారం అంరంగ వైభవంగా బోనాల వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తి శ్రద్ధలతో ఇంటి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించుకుని బోనాలను ఎత్తుకుని డప్పు చప్పుళ్ళతో బొడ్రాయి, ముత్యాలమ్మ, గ్రామ దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని కరకగూడెం, భట్టుపల్లి, అనంతారం, పద్మాపురం, సమత్ భట్టుపల్లి, చిరుమళ్ళ, మోతె గ్రామాలలో బోనాలతో మహిళలు ఘనంగా సంబరాలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో పసుపు, కుంకుమ, చీరెలు, గాజులు ఉంచి తమను సౌభాగ్యాలతో, పసిడి పంటలతో చల్లంగా చూడాలని వేడుకున్నారు. డప్పు వాయిద్యాలతో గ్రామదేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు.

ఈ దవాఖానా.. సమస్యలకు నిలయం

సౌకర్యాల లేమితో రోగులకు తప్పని అవస్థలు



జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రి

జూలూరుపాడు, ఆగస్టు 11: ప్రభుత్వాసుపత్రిలో సౌకర్యాల లేమితో రోగులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. గత కొన్ని నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్నప్పటికి సమస్యలను పట్టించుకునేవారే కరువైయ్యారు. మినరల్ వాటర్ ప్లాంట్ ఉన్నప్పటికి పనిచేయదు. రోగుల దాహార్తి తీర్చదు. ఇన్వటర్ ఉన్న పనిచేయదు. బ్యాటరీ కాలిన పట్టించుకునే దిక్కే ఉండదు. సీబీపీ మిషన్ ఉన్నప్పటికి రోగుల పరీక్షల నిర్వహణకు అనువుగా లేదు. ల్యాబ్ గది తలుపులు తెరుచుకోవు. ఇది జూలూరుపాడులోని ప్రభుత్వాసుపత్రి దుస్థితి. 15 రోజులుగా ఈ ఆసుపత్రికి రోగుల తాకిడి అధికమైంది. వర్షాకాలం కావడంతో విషజ్వరాల బారిన పడి ప్రతి రోజు 180 నుంచి 200 మంది రోగులు చికిత్సలను పొందేందుకు వస్తున్నారు. మందులు లభించక ఇబ్బందులు పడుతున్నారు. రోగులకు సరిపడా మంచాలు లేకపోవడంతో చాలా మంది రోగులు గంటల కొద్ది నిరీక్షించాల్సి వస్తుంది. రోగులకు తాగునీటిని అందించేందుకు ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయకపోవడంతో తాగునీరు అందుబాటులో లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. జ్వరపీడితులకు రక్తకణాలు(ప్లేట్‌లేట్స్) పరీక్షకు సంబంధించిన సీబీపీ మిషన్ ఉన్నప్పటికి సక్రమంగా పనిచేయటం లేదు. దీంతో జ్వర పీడితులు ప్రైవేట్ ల్యాబ్‌ల వద్దకు వెళ్లి పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇన్వర్టర్ బ్యాటరీ కాలిపోయినప్పటికి మరొకటి ఏర్పాటు చేయలేదు. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయంలో ఆసుపత్రితో ఫ్యాన్లు తిరగక, లైట్లు వెలగక రోగులు, వైద్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. పాములు, తేళ్ల ఆసుపత్రులోకి వస్తాయేమోనని ఆందోళన చెందుతున్నారు. రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించే ల్యాబ్ టెక్నీషియన్ గత కొన్ని రోజుల క్రితం బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మరో ల్యాబ్ టెక్నీషియన్ ఆసుపత్రికి నియమించినప్పటికి విధులకు హాజరు కాకపోవడంతో ల్యాబ్ తలుపులు తెరుచుకోవడం లేదు. విష జ్వరాలు విజృంభిస్తున్న సమయంలో ల్యాబ్ టెక్నీషియన్ లేకపోవడం రోగులను ఇబ్బందులకు గురిచేస్తుంది. ఇన్ని సమస్యలు దర్శా ఆసుపత్రిలో నెలకొన్నప్పటికి వాటిని పరిష్కరించకపోవడం పట్ల రోగులు ఆసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన జిల్లా వైద్య సిబ్బంది స్పందించి ఆసుపత్రులో నెలకొన్న సమస్యలను తీర్చి తమ ఇక్కట్లను తీర్చాలని పలువురు కోరుతున్నారు.

రోగుల ఇబ్బందులను తొలగిస్తాం

ఈ విషయమై ఆసుపత్రి డీడీవో రాకేష్ వివరణ కోరగా.. సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. త్వరలోనే ఇన్వర్టర్‌కు బ్యాటరీని ఏర్పాటు చేయటంతో పాటు, వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులను చేయిస్తామన్నారు.

నిరుపేదలకు ప్రభుత్వం అండ: పాయం



చెక్కులను అందజేస్తున్న పాయం

కరకగూడెం, ఆగస్టు 11: మండలంలోని 8 మంది లబ్ధిదారులకు ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని నేరుగా ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మధ్యవర్తిత్వం ఉండదని అటువంటి వారు ఉంటే నేరుగా నాదృష్టికి తీసుకరావాలని తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఇక్బాల్ హుస్సేన్, శ్రీను పాల్గొన్నారు.

‘రోటరీక్లబ్ సేవలు అభినందనీయం’



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

బూర్గంపాడు, ఆగస్టు 11: ఐటీసీ అనుబంధ సంస్థ రోటరీ క్లబ్ ఆఫ్ భద్రా, రోటరాక్ట్ క్లబ్ సేవలు అభినందనీయమని పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బూర్గంపాడు మండల పరిధిలోని తాళ్లగొమ్మూరు రైతు వేదికలో ఆదివారం రోటరీ, రోటరాక్ట్ క్లబ్‌ల సంయుక్తంగా ఐటీసీ సహకారంతో మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యాతిగా పాల్గొని ఐటీసీ యూనిట్ హెడ్ ప్రణవ్‌శర్మ, జనరల్ మేనేజర్ శ్యామ్‌కిరణ్‌లతో కలిసి మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ రోటరీ సేవలను కొనియాడి..రోటరీ, రోటరాక్ట్ క్లబ్‌లు మరిన్ని విస్తృతమైన సేవలను చేయాలని అన్నారు. స్థానికులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్యశిబిరంలో ఐటీసీ డాక్టర్లు విజయ్‌కుమార్, నిఖిల్, అమృత పాల్గొని రోగులను పరీక్షించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సారపాక పంచాయతీ ఈవో మహేష్, రోటరీ సభ్యులు డీవీఎం నాయుడు, సాయిరాం, చెంగళరావు, రంజిత్, డేవిడ్, రోటారాక్ట్ సభ్యులు అరవిందన్, చైతన్య, రామకృష్ణ, విష్ణుప్రియ, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రసాద్, హరీష్, మహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

సారపాకలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే

మణుగూరు, ఆగస్టు 11: మణుగూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం రూ.7.50 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గంలో సీఎంఆర్ఎఫ్ పథకానికి దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం నుంచి మంజూరి సొమ్ము చెక్కుల రూపంలో అందిందన్నారు. నియెజకవర్గంలోని ఆళ్లపల్లి, పినపాక, కరకగూడెం, బూర్గంపాడు మండలాలకు చెందిన వారికి ఈ చెక్కులను అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్, కరకగూడెం మండల నాయకులు ఇక్బాల్ హుస్సేన్, నాయకులు శివ, సామా శ్రీనివాసరెడ్డి, పాతూరి వెంకన్న, బాబు, రహీమ్ పాషా, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

‘ప్రజల ఆశీస్సులతోనే అభివృద్ధి చేశాం’



జడ్పీటీసీ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

బూర్గంపాడు, ఆగస్టు 11: మండల ప్రజల పూర్తి సహకారంతోనే గడిచిన ఐదేళ్ల కాలంలో ఎన్నో నిధులు తీసుకవచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తాజా మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత-రామకొండారెడ్డి దంపతులు అన్నారు. ఆదివారం లక్ష్మీపురం గ్రామంలోగల జడ్పీటీసీ నివాసంలో మోరంపల్లిబంజర గ్రామస్థులు వారిని సన్మానించారు. శాలువలతో సత్కరించి పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు.

‘సీతారామ’ ట్రయల్ రన్ విజయవంతం



‘సీతారామ’కు పూజలు చేస్తున్న మంత్రులు

ములకలపల్లి, ఆగష్టు 11: ములకలపల్లి మండలం పూసుగూడెం వద్ద నిర్మించిన సీతారామ పంప్‌హౌస్ -2 ట్రయల్ రన్‌ను ఆదివారం నీటిపారుదులశాఖా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు తమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలసి ప్రారంభించిన ట్రయల్ రన్ విజయవంతం అయ్యింది. పంపు హౌస్‌లో స్విచ్ ఆన్‌చేసి మోటారును ఆన్‌చేయగానే గేటు నుంచి గోదావరి నీరు ఉవ్వెత్తున బైటకు పొంగి పొర్లాయి. ప్రాజెక్టు గేటునుండి బైటకు వచ్చిన నీటివద్దకు వెళ్ళి మంత్రులు, అధికారులు పూజలు చేసారు. ఆ దృశ్యాన్ని చూస్తూ కొద్ది సేపు సంభ్ర మాశ్చర్యాలకు గురి అయ్యారు. గోదావరి నీటిని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తేవడం ద్వార తమ జన్మ ధన్యం అయ్యిందని మంత్రులు వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఈ పంపు హౌస్‌లను ఈనెల 15వ తేదీన ప్రారంభించినున్నట్టు ప్రకటించారు.

రైతులను అడ్డుకున్న పోలీసులు

సీతారామ ప్రాజెక్టు పంప్‌హౌస్‌ను ప్రారంభ కార్యక్రమానికి వచ్చిన మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల, పొంగులేటిని కలిసేందుకు కమలాపురం, ములకలపల్లి మండలాలకు చెందిన రైతులు వచ్చారు. పోలీసులు అడ్డుకోవటంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈ ప్రాజెక్టు కోసం తమ భూములు ఇచ్చామని తమ భూములకు నీరు వస్తాయోలేదో తెలియదని తమ సమస్యలు చెప్పుకునేందుకు వస్తే తమ సమస్యలు చెప్పుకొనివ్వరా అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మంద కృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

చంద్రుగొండ, అగస్టు 11: ఎస్సీ వర్గీకరణ కోసం కృష్ణమాదిగ ఆధ్వర్యంలో జరిగిన పోరాటంవల్లే వర్గీకరణకు మార్గం సుగమమైయిందని మండల ఎంఆర్‌పీఎస్ నాయకులు తెలిపారు. వర్గీకరణకు అనుకూలంగా ఆదివారం చంద్రుగొండలో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో విజయోత్సవ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



కేక్ కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

పాల్వంచ, అగస్టు 11: పూర్వ విద్యార్థులు అపూర్వ రీతిలో కలుసుకున్నారు. 14 ఏళ్ల తరువాత తమ చిన్ననాటి మిత్రులను కలుసుకుని సంబరాలు జరుపుకున్నారు. ఆదివారం పాల్వంచ స్వాతి స్కూల్ ఆవరణలో ఈ సంబరాలు మిన్నంటాయి. పాల్వంచ స్వాతి స్కూల్‌లో 2009-10 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. రోజంతా ఆటపాటలతో సంతోషంగా గడిపారు. అనంతరం స్వాతి స్కూల్ వ్యవస్థాపకుడు మల్లెల రవిచంద్ర, స్వప్నకుమారి, గురువులు ఇందిర, రాధిక, ప్రసన్న కుమారి, అంజనీకుమార్, సర్వేశ్వరరావు, భవానీ, విజయలక్ష్మిలను ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు సాయిరామ్, సయ్యద్ న్యూమన్, వెంకటేష్, జ్యోష్ణ, లాల్‌సింగ్, భవానీ, హిమజ, శిరీష, ప్రేమశైలజ, శ్రీనివాస్, ప్రశాంత్, నాగశివప్రసాద్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్ఐ నిజాయితీపరుడేమీ కాదు’

పాల్వంచ, అగస్టు 11: ఏసీబీకి పట్టుబడిన పాల్వంచ ఎస్ఐ బానాల రాము నిజాయితీపరుడేమీ కాదని ఏసీబీ కేసులో ఫిర్యాదుదారుడైన న్యాయవాది లక్ష్మారెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. ఆదివారం బానాల రాము బాధితుడిగా చెప్పబడుతున్న మరో వ్యక్తితో కలిసి పాల్వంచ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పాల్వంచ టౌన్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నప్పుడే కాక ఇతర ప్రాంతాల్లో చేసినప్పుడు కూడా అతనిపై అనేక ఆరోపణలు ఉన్నాయని, అందులో మహిళలను లైంగికంగా వేధించిన సంఘటనలు కూడా ఉన్నాయని ఆరోపించారు. సదరు ఎస్ఐ బాధితులుగా చెప్పబడుతున్న సుమారు 15 మంది ఏసీబీ కేసు అనంతరం ధైర్యం తెచ్చుకుని తనను ఆశ్రయించారని దశల వారీగా అన్నీ బహిర్గతం చేస్తానని అన్నారు. బాధితుడు మద్దినేని రమేష్ మాట్లాడుతూ బానాల రాము తన ఇంట్లో నాలుగు సంవత్సరాలు అద్దెకు ఉండి ఇల్లు ఖాళీ చేయమంటే కక్ష పూరితంగా తనపై తప్పుడు కేసులు పెట్టాడని, నేను అతనికి డబ్బులు ఎగ్గొట్టినట్లుగా తప్పుడు సాక్ష్యాలు సృష్టించి చివరకు ఏ ఆధారాలు లేకుండా నన్ను జైలుకు కూడా పంపాడని ఆరోపించారు. డబ్బులకు ఎలాంటి సాక్ష్యాలు లేవని అన్నారు. పాల్వంచకు చెందిన కొందరు రాము అభిమానులు రాము నిజాయితీపరుడని పేర్కొంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంతో వారికి నిజం తెలియజేయడానికే తాము ఈ మీడియా సమావేశం నిర్వహించామన్నారు.

‘యాదవులు ఐక్యతను చాటాలి’



మాట్లాడుతున్న మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి

ఇల్లెందు టౌన్, ఆగస్టు 11: యాదవులు తమ సమస్యల సాధనతో పాటు అభివృద్ధిలో పయనించేందుకు ఐక్యతను చాటాలని ఇల్లెందు మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఇల్లెందులో యాదవ సంఘం పట్టణ స్థాయి చైతన్య సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యాదవుల సంక్షేమం కోసం అనేక చర్యలను చేపట్టిందని వెల్లడించారు. గతంలో ఇచ్చిన గొర్రెల పంపిణీలో అవకతవకలు జరిగినట్లుగా ఆరోపణలు వచ్చిన నేపధ్యంలో కొత్త ప్రభుత్వం పకడ్బందీగా యాదవుల సంక్షేమంపై దృష్టి కేంద్రీకరించిందని వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి యాధవులు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, కాంగ్రెస్ నాయకులు నాగా సీతారాములు, బీఆర్ఎస్ మాజీ కార్పోరేటర్ పడాల నాగరాజు, యాదవ సంఘం ఇల్లెందు మండల నాయకులు సుంకరబోయిన సత్యనారాయణ, కరెంట్ శ్రీనివాస్, బయ్యా వరప్రసాద్, పెరుగు కొటేశ్వరరావు, విశ్వేశ్వరరావు, మేకల మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

భద్రాచలం, ఆగస్టు 11: గ్రామ పంచాయతీ కార్మికుల కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పీఆర్‌సీ పరిధిలోకి కార్మికులను తీసుకురావాలని సీఐటీయు జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ అన్నారు. భద్రాచలంలో నేడు తలపెట్టిన జిల్లా వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. అర్హులైన వారిని కార్యదర్శులుగా నియమించాలని, జీవో నెం.51ని సవరించాలని, విధి నిర్వహణలో చనిపోయిన కార్మికులకు రూ.10 లక్షల నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవి, యూనియన్ నాయకులు శ్రీనివాస్, సాయి, చెన్న కేశవులు, ప్రేమ్, వరరాజు, విజయ పాల్గొన్నారు.

‘ఉద్యమంలో ఉద్యోగుల పాత్ర మరువలేనిది’

భద్రాచలం, ఆగస్టు 11: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం చేసిన ఉద్యమంలో మాదిగ ఉద్యోగుల పాత్ర మరువలేనిదని మాదిగ ఉద్యోగ సంఘం నాయకులు పేర్కొన్నారు. భద్రాచలంలో ఆదివారం మాదిగ ఉద్యోగుల ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాదిగ ఉద్యోగులు డాక్టర్ ఆర్.నారాయణ, బీమపాక పెదరాజు, గద్దల నరసింహారావు మాట్లాడుతూ మాదిగ ఉద్యోగులు ఉద్యమకారులకు అండదండలు అందిస్తూ ఉద్యమకారులను ఉద్యమంలో ప్రోత్సహిస్తూ అండగా ఉన్నారని అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే అమలు చేయాలని కోరారు. వర్గీకరణ సాధనలో ఉద్యోగులు ఎన్నో రీతుల్లో ఉద్యమాలు నిర్వహించారని, వారి పోరాటం సామాన్యం కాదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్కిరాల శ్రీనివాసరావు, ఐనంపూడి జపాన్‌రావు, కోట దేవదానం, నహిమియా, ఉదయ్, రావులపల్లి సత్యం, ముద్దా పిచ్చయ్య పాల్గొన్నారు.

‘పేడే’ తగ్గింపుపై టీబీజీకేఎస్ నిరసన



మాట్లాడుతున్న నాయకుడు వెంకట్

మణుగూరు, ఆగస్టు 11: సింగరేణి కాలరీస్ కంపెనీకి బాధ్యతాయుతంగా పనిచేస్తూ అనుకున్న లక్ష్యాలను సాధించడంలో కీలక పాత్ర పోషించే ఆపరేట్లకు యాజమాన్యం పేడే తగ్గించడాన్ని నిరసిస్తూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తంచేశారు. ఆదివారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు ఎన్.వెంకట్ మాట్లాడుతూ.. ఆదివారం రోజు పే డేలు తగ్గించి ఆపరేటర్ల కడుపుకొడుతున్నారని ఆరోపించారు. యాజమాన్య వివక్ష వైఖరికి నిరసనగా ఈ రోజు ఆపరేటర్ల విధులు బహిష్కరించారని తెలిపారు. ఇలాంటి పరిణామాలు భవిష్యత్‌లో ప్రమాదకరంగా మారుతాయని హెచ్చరించారు. బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడుతుందన్నారు. అధికారులు నిబంధనలకు పాతరేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బంగారి పవన్ కుమార్, రామాచారి, ఇబ్రాయిల్, మునిగెల నాగేశ్వరరావు, ముస్తాన్, రాజ్‌కుమార్, ముకేష్, శ్రీనివాస్ రమేష్, వినయ్‌కుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నార